
ప్రజలే ప్రభువులు

# జనబలం

మే 2026 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-






## విజయ్ 'విజిల్'కు సాంప్రదాయ రాజకీయ పార్టీలు మేలుకొంటాయా?

## ఓపీఎస్..అప్పుల భారంతో ప్రభుత్వోద్యోగుల జీతాలు కట్




## డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్.. దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్‌గోల్



## ఇరాన్ యుద్ధం.. మన ఇళ్లలో బంగారం

# విశాఖ డెయిరీ- స్వచ్ఛమైన పాలు, ఆరోగ్యానికి మూలం






ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

మే
2026

సంపుటి 27
సంచిక 05


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్



06 విజయ్ 'విజిల్'కి సాంప్రదాయ రాజకీయ పార్టీలు మేలుకొంటాయా?

10 డీలిమిటేషన్ - మహిళా రిజర్వేషన్ .. దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్ గోల్

13 'డీలిమిటేషన్-మహిళా రిజర్వేషన్' రాజ్యాంగ సవరణ చర్చ

16 కొన్ని లోపాలున్నా.. మహిళా రిజర్వేషన్ చట్టం 2029 నుండే అమలు మేలు

18 ఓపీఎస్ ఊబిలో హిమాచల్ ప్రదేశ్.. ప్రభుత్వోద్యోగుల జీతాలు కట్

20 రుణమాఫీలు, ఉచిత విద్యుత్తా?..నిజమైన సంక్షేమమా? రాష్ట్రాలు తేల్చుకోవాలి


### కార్టూన్ కార్నర్





28 ఇరాన్ యుద్ధం - మన ధాన్యం రైతులు

31 బంగారం చెలామణిలోకి తెద్దాం.. కొంతకాలం దిగుమతులు ఆపేద్దాం



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఉన్నత పాఠశాల విద్యలో సమూల సంస్కరణలు అవసరం!

సంక్షోభంలో ఉన్న సెకండరీ పాఠశాల విద్యను సమూలంగా సంస్కరించాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. ప్రాథమిక స్థాయిలో పాఠశాల నమోదులో ఘన విజయం సాధించిన భారత్ సెకండరీ స్థాయికి వచ్చేసరికి అడుగులు తడబడుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

సెకండరీ స్థాయిలో తగినన్ని పాఠశాలలు లేకపోవడం, నమోదులో స్థిరత్వం లేకపోవడం, పిల్లల తరగతి వారీ సామర్థ్యాలలో లోటు, అభ్యసనంలో నాణ్యత లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత, ఉపాధ్యాయుల సామర్థ్యాలలో నాణ్యతా లోపం, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం వంటి సమస్యలు సెకండరీ విద్యా రంగాన్ని పట్టి పీడిస్తున్నాయని నీతి ఆయోగ్ విద్యావిభాగం చేసిన విశ్లేషణలో పేర్కొన్నది.

"భారత దేశంలో సెకండరీ విద్య – తాత్కాలిక విశ్లేషణ – నాణ్యత పెంపుదలకు మార్గ ప్రణాళిక" పేరిట నీతి ఆయోగ్‌కు చెందిన విద్యా విభాగం రూపొందించిన నివేదిక 2026 మే మొదటి వారంలో విడుదల అయ్యింది. యూ డైస్, పరఖ్, అసర్, యునెస్కో, వంటి సంస్థల గణాంకాల ఆధారంగా గత దశాబ్దకాలంలో పాఠశాల విద్య పురోగతిని , ఎదుర్కొంటున్న సవాళ్లను ఆ నివేదిక వివరంగా ప్రస్తావించింది.దేశంలో మొత్తం 14.71 లక్షల పాఠశాలలు ఉండగా అందులో సుమారు 25 కోట్లమంది పిల్లలు చదువుతున్నారు. 1 నుండి 5 వ తరగతి వరకూ బోధించే ప్రాథమిక పాఠశాలల సంఖ్య ఏడున్నర లక్షలు. 9 వ తరగతి నుండి 10 వ తరగతి వరకూ బోధించే పాఠశాలలు లక్షా నలభై వేలు. 1 నుండి 12 వ తరగతి వరకూ ఉండే పాఠశాలలు కేవలం ఐదు శాతం మాత్రమే ఉన్నాయి.

ఐదు, ఎనిమిది, పది తరగతులు పూర్తయ్యాక పిల్లలంతా వేర్వేరు బడులకు మారాల్సి రావడం ఒక పెద్ద సమస్యగా పరిణమించింది."వివిధ స్థాయిల్లో నమోదులో స్థిరత్వం, బడిలో విద్యార్థులు నిలకడగా కొనసాగడం పెద్ద సమస్యగా ఉంది. పాఠశాలల నిర్మాణ చట్రం చాలా బలహీనంగా ఉంది, నమోదు చక్రం తీవ్రమైన సమస్యలతో కునారిల్లుతున్నది " అంటూ నీతి ఆయోగ్ నివేదిక హెచ్చరించింది. ప్లస్ టూ స్థాయిలో నమోదు శాతం పదేళ్ల క్రితం 67శాతంగా ఉండగా ప్రస్తుతం 75 శాతంగా పెరిగింది. కానీ స్థూల నమోదు నిష్పత్తి జాతీయ స్థాయిలో 58.4గా ఉన్నది. ఈ సంఖ్య బీహార్‌లో 38 శాతంగా ఇప్పటికీ కొనసాగడం కలవరం కలిగించే విషయమే.

ప్రాథమిక పాఠశాల స్థాయిలో డ్రాప్ ఔట్ రేటు 0.3 శాతం మాత్రమే. అదే అప్పర్ ప్రైమరీ స్థాయిలో 3.5 శాతం కాగా, సెకండరీ స్థాయిలో 11.5 శాతానికి, హయ్యర్ సెకండరీ స్థాయిలో 42 శాతానికి చేరుకుంటున్నది."ఆర్థిక ఇబ్బందులు, చిన్నవయసులోనే పనిలో చేరిపోవడం, సామాజిక ఒత్తిళ్ళు, విద్యాప్రగతికి ప్రతిబంధకంగా తయారవుతున్నాయి. కీలక దశలో పాఠశాల "నమోదు చక్రం"లో ఇదో పెద్ద బలహీనతగా తయారయ్యింది." అంటూ నివేదిక విశ్లేషించింది.

దేశంలో దాదాపు 33 శాతం పాఠశాలలు 50 కంటే తక్కువమంది పిల్లలతో నడుస్తుండగా ఆయా బడుల్లో ఉపాధ్యాయులు సమాంతరంగా మల్టీ గ్రేడ్ బోధన చేయాల్సి వస్తున్నది. దేశంలో దాదాపు ఏడు శాతం పాఠశాలలు ఒకే ఉపాధ్యాయునితో నడుస్తున్నాయి. ఇలాంటి బడుల్లో ఉపాధ్యాయులు ఐదు తరగతుల బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ, పాలనాపరమైన బాధ్యతలు, ఒకేసారి చేయాల్సి ఉంటుంది. అవి కాకుండా ఎన్నికలు, జనాభా లెక్కలు, రకరకాల ప్రభుత్వ సర్వేలు అదనంగా చేయాల్సి వస్తున్నది. ఒక విద్యా సంవత్సరంలో బోధనేతర పనులకోసం ఉపాధ్యాయులు వెచ్చిస్తున్న పనిగంటలు జాతీయ స్థాయిలో 14 శాతం ఉన్నాయి. మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, కర్ణాటక, వంటి రాష్ట్రాల్లో మంజూరైన సంఖ్య కంటే ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఒక్క బీహార్ లోనే వివిధ స్థాయిల్లో దాదాపు రెండున్నర లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లకు హాజరవుతున్న ఉపాధ్యాయుల్లో కేవలం పదిహేను శాతం మాత్రమే ఉత్తీర్ణతకు అవసరమైన అరవై మార్కుల గీతను దాటుతున్నారు. సైన్సు, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల అవగాహనలో, బోధనా సామర్థ్యాలలో స్పష్టంగా లోటు కనిపిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు గత ఇరవై ఏళ్లలో 71 శాతం నుండి 49 శాతానికి పడిపోగా , ఆ మేరకు ప్రైవేటు పాఠశాలల నమోదు 44 శాతానికి పెరిగింది. ఆంగ్ల మాధ్యమం, ఎక్కువ పనిగంటలు, ప్రత్యేక శ్రద్ధ వంటి అంశాలలో ప్రైవేటు పాఠశాలలపై తల్లి తండ్రులకు గల భావనల కారణంగా ప్రైవేటు నమోదు పెరిగిన మాట నిజమే. కానీ పిల్లల అభ్యసనా సామర్థ్యాల విషయంలో ప్రైవేటు పాఠశాలలు పెద్దగా రాణిస్తున్న దాఖలా ఏమీ కనిపించడంలేదు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల విద్యార్హతలు నామమాత్రంగా ఉంటున్నాయి.

చిన్న మధ్యతరహా పట్టణాల్లో తక్కువ ఫీజు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలల్లో 5 వ తరగతి చదువుతున్న పిల్లల్లో 2 వ తరగతి పాఠాన్ని చదవగలిగేవారు 35 శాతం మాత్రమే ఉన్నారు. ఆయా పాఠశాలల్లో 60 శాతం పిల్లలు ఒక చిన్న భాగహారాన్ని కూడా చేయలేకపోతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో సెకండరీ విద్యను సమూలంగా సంస్కరించాలని నీతి ఆయోగ్ తాజా నివేదిక సిఫార్సు చేసింది. పాలన, బోధన, మౌలిక వసతుల కల్పన, సాంకేతికత వినియోగం వంటి రంగాల్లో పెను మార్పులకు సిద్ధం కావాలని ఆ నివేదిక సూచించింది. ఆ దిశగా పలు చర్యలు తీసుకోవాలని నివేదిక సిఫార్సు చేసింది.

ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకూ ఒకటే "ఉమ్మడి పాఠశాల" ఉండాలి. అవసరమైన అన్ని సందర్భాల్లోనూ రేషనలైజేషన్ చేపట్టాలి. అన్ని స్థాయిల్లోని పాఠశాలలకు ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన జరగాలి. బోధన, అభ్యసనం, పాఠశాల పాలనా వ్యవహారాలను డిజిటల్ సదుపాయాలతో అనుసంధానం చేయాలి. అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం, వారి బోధనా సామర్థ్యాలకు సాన బెట్టడం జరగాలి. వారికి వృత్తి పరమైన పురోగతి కల్పించాలి. విద్యార్థులకు ఆచరణాత్మక అభ్యసనం ద్వారా నైపుణ్యాలను నేర్పడం కోసం పాఠశాలల్లో గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, వనరుల కేంద్రాలను బలోపేతం వేయాలి.

బోధనలో కృత్రిమ మేధను వినియోగించడంపై కూడా నీతిఆయోగ్ జాగరూకతతో స్పందించింది. కృత్రిమ మేధ అనేది ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాదని, అది ఉపాధ్యాయుని చేతిలో ఒక ఉపకరణం మాత్రమేనని పేర్కొన్నది. పాఠశాల స్థాయిలో ఎ.ఐ. వినియోగంలో అతి కూడదని, దానిని కొన్ని పరిమితుల్లో మాత్రమే అనుమతించాలని, పిల్లలపై చూపే ప్రతికూల ప్రభావాలను గమనిస్తూ ఉండాలని ఆ నివేదిక పేర్కొన్నది.

సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల అవసరాలకు అనుగుణంగా తోడ్పాటు అందించాలి. వివక్షకు అవకాశం లేకుండా జెండర్ సమానత్వం కోసం గట్టి ప్రయత్నం జరగాలి. విద్యను నిరంతరం కొనసాగించడానికి వీలుగా వలస, సంచార కుటుంబాల పిల్లలతో సహా విద్యార్థుల డ్రాప్ ఔట్‌ను నివారించాలి. వారిని పాఠశాలలో తిరిగి చేర్చడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలి.

మన సమాజం 2047నాటికి "వికసిత్ భారత్" లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యలో నాణ్యతను పెంపొందించడం అత్యంత కీలకం అవుతుంది. అందుకు విద్యారంగం ఒక్కటే కృషి చేస్తే సరిపోదు. సమాజం మొత్తం దీన్ని ఒక "మిషన్" గా స్వీకరించాలి. పిల్లల సామర్థ్యాలను ఆరంభ దశలోనే గుర్తించగలిగే విధంగా తరగతి గదులు తయారు కావాలి. పిల్లల ప్రతిభకు నిరంతర పోషణ అందించాలి. పిల్లల ఆకాంక్షలకు తగిన అవకాశాలను అందుబాటులో ఉంచాలి. అప్పుడే అత్యున్నత ప్రమాణాలు కలిగిన, విలువల ఆధారిత విద్యను పాఠశాలల్లో సాధించగలం. పాఠశాల విద్యారంగంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న సంక్షోభ పరిష్కారానికి నీతి ఆయోగ్ విద్యా విభాగం నివేదికలోని సిఫార్సులపై పౌరసమాజం లోతైన చర్చ చేయాల్సి ఉంది.

డి. సోము సుందర్

# విజయ్ 'విజిల్'కి సాంప్రదాయ రాజకీయ పార్టీలు మేలుకొంటాయా?

## -5 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జేపీ-



ప్రజాస్వామ్యంలో ఎంత బలముందో ఎన్నికల ఫలితాల రోజు మనకు అర్థమవుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మనం రకరకాల ఊహాగానాలు చేస్తాం, ప్రజలేదో నిమిత్తమాత్రులు అనుకుంటాంగానీ.. బ్యాలెట్ పత్రాలు, ఈవీఎంలు తెరిచి ఎవరు నెగ్గారో లెక్కించినపుడు ప్రజాస్వామ్యంలోని ఔన్నత్యం మనకు అర్థమవుతుందన్నారు. కొన్నిసార్లు అద్భుతాలు జరగ వచ్చన్నారు. ***అసోం, పశ్చిమ బంగ, తమిళనాడు, కేరళం, పుదుచ్చేరి (యూటీ) అసెంబ్లీ ఎన్నికలు 2026 ఫలితాలపై జేపీ తన అఫీషియల్ యూట్యూబ్ ఛానల్‌లో స్పందించారు. అందులోని అంశాలు సంక్షిప్తంగా:***

అయిదు అసెంబ్లీల తాజా ఎన్నికల్లో ఎక్కువగా దిగ్భ్రాంతిని, ఆశ్చర్యాన్ని కలిగించనది తమిళనాడు ఎన్నిక ఫలితం.

'ఇప్పటిదాకా దేశ రాజకీయాల్లో మన దేశం ఉన్న పరిస్థితుల్లో రెండు బలమైన పార్టీలు పాతుకుపోయినప్పుడు, కొన్ని పొరపాట్లున్నా కూడా కొంత మంచి చేస్తున్నప్పుడు.. రెండు పార్టీలనూ ఇంటికి పంపించేసి కొత్తపార్టీని అధికారంలోకి తీసుకురావటం దాదాపు అసాధ్యం. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, తక్కువ వచ్చినవారికి ఎన్ని ఓట్లు వచ్చినా ఓడిపోయినట్లే, ఆ ఓట్లన్నీ వృథాయే.. అనే మన ఎన్నికల వ్యవస్థ ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్.పి.టి.పి) అందుకు కారణం. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్)ని తీసుకోండి. ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు.. కాంగ్రెస్ పార్టీ వివిధ కారణాల వల్ల అక్కడ పూర్తిగా పతనమైంది. అదేవిధంగా పంజాబ్‌లో అకాలీదళ్ కూలిపోయి, ప్రజల మనసుల్లో నుండి అదృశ్యమైపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అవశేష ఏపీలో తెరమరుగు కావటంతో జగన్ పార్టీకి అవకాశం వచ్చింది. అంతేగానీ, రెండు పార్టీలు బలంగా వేళ్లూనుకున్నచోట; అనుభవం, ఆరితేరిన, కాస్త గట్టి నాయకత్వం ఉన్నప్పుడు; ఉన్నంతలో మంచి పరిపాలన ఇస్తున్నారనుకున్నప్పుడు.. మూడో పార్టీకి అవకాశం ఇవ్వటం అసాధారణం. తమిళనాడు ప్రస్తుత శాస నసభ ఎన్నికల్లో అదే జరిగింది. సుమారు అరవై ఏళ్ల ద్రవిడ పార్టీల మూస రాజకీయానికి గండిపడింది.

'నిజానికి, తమిళనాడులో సంక్షేమ పథకాలను ఎవరికీ తీసిపోనిరీతిలో అమలు చేస్తున్నారు. అదేవిధంగా, ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు. దేశంలోని ఆటోమొబైల్ రంగమంతా తమిళనాడులోనే ఉంది. ఐఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ఆ రాష్ట్రం కేంద్రంగా ఉంది. గత సంవత్సరం తమిళనాడు వాస్తవ ఆర్థిక ప్రగతి 10.8%. అధికార యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందన్న గుర్తింపు ఉంది. ప్రభుత్వానికి చెడ్డపేరు లేదు. ఉన్నంతలో గత ప్రభుత్వం, అంతకు ముందున్న ఏఐడీఎంకే ప్రభుత్వాల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏమీ లేదు. మామూలుగా సాంప్రదాయ రాజకీయం, అవినీతి, ఎన్నికల్లో డబ్బు ఖర్చు వంటివి అన్నిచోట్లా ఉన్నట్లే అక్కడా ఉన్నాయి. అలాంటప్పుడు రెండు ప్రధానపార్టీలనూ పక్కనపెట్టి, ప్రజలకు తెలిసిన ముఖం, నటచాతుర్యంతో ప్రజల్ని మెప్పించిన ముఖం నాయకత్వంలో పెద్దగా సైద్ధాంతిక బలంలేని పార్టీ నెగ్గటం దిగ్భ్రాంతికరమైనది.

'ఒకరకంగా, ప్రస్తుతమున్న రాజకీయం కొనసాగటం సాధ్యం కాదు, ప్రజలు ఎప్పుడైనా ఫలితాలను తారుమారు చేయ వచ్చు, కొత్త ముఖాలని, కొత్త పార్టీలనూ తీసుకురావచ్చు.. అన్నది మంచి సంకేతం. అలాంటి హెచ్చరిక లేకపోతే ఏమవుతుందంటే.. పాతుకుపోయిన పార్టీలు తాము తప్ప ఇంకెవరూ గతిలేరని భావించే అవకాశముంది. దాన్నుంచి బయటపడటానికి ఇది మంచి అవకాశం. ఈ దేశ ప్రజా స్వామ్యంలో ఏం మార్పులు తేవాలి, ప్రజల్లో అసంతృప్తిని ఏరకంగా తొలగించాలి.. అంశాలపై పార్టీలు ఇకనైనా దృష్టి పెడితే మంచిది. కానీ ఈ ప్రజాతీర్పులో ప్రమాద ఘంటిక కూడా ఉంది.

'ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందుతున్న. ఉన్నంతలో కాస్త మంచి పాలన అందిస్తున్న రాష్ట్రంలో కూడా ప్రధాన పార్టీలను, వేళ్లూనుకున్న పార్టీలను తిరస్కరించి కొత్త పార్టీకి పట్టం గట్టారంటే.. ప్రజల్లో క్షణాల్లో మార్పు రావాలన్న కోరిక కనిపిస్తోంది. గతంలో ఒక సినిమా వచ్చింది. 'ఒకే ఒక్కడు' అని. అందులో హీరో ముఖ్యమంత్రి అయి 24 గంటల్లో రాష్ట్రాన్ని మొత్తం మార్చేస్తాడు. వాస్తవ జీవితంలో ఇది ఎక్కడా జరగదు. అయినా తమిళ ప్రజలు అలా తపన పడ్డారంటే.. ఈ సోషల్ మీడియా యుగంలో మన జీవితాల్లోనూ అద్భుతాలు జరగాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇదేరకంగా.. వెంటనే మార్పు జరగాలనే కాంక్షతో, ఆ తొందరపాటుతో, ఆకాంక్షలు వెంటనే నెరవేరటంలేదనే అసంతృప్తితో గనక ఎన్నికల్లో ఓట్లు వేయటానికి ప్రజలు సిద్ధపడితే– దేశంలో అస్థిరత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి.. ఒకపక్కన అవకాశం, మరో పక్కన ప్రమాదం. దీన్ని కొంచెం లోతుగా అధ్యయనం చేసి పాఠాలు నేర్చుకోవాలి.

'ఉదాహరణకి, తమిళనాడులో మనకు అర్థమైనంతవరకు మైనారిటీలు దాదాపు అందరూ విజయ్ పార్టీకి ఓటు వేశారు. క్రైస్తవులు, ముస్లింలు. అదేవిధంగా 20%గా ఉన్న దళితులూ విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కి ఓటు వేసినట్లు అంచనా. తమిళనాడులో ఆర్థికాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను బాగా సమర్థంగా అమలు చేస్తున్నా ప్రజలు ఇలా ఓటు వేయటంపై మనం వెంటనే మేలుకోనట్లయితే, మన రాజకీయంలో ఉన్న పొరపాట్లు సవరించుకోనట్లయితే.. మూల్యం చెల్లించుకోకతప్పదు. రాజ కీయ పార్టీలు, అందులోనూ సాంప్రదాయ రాజకీయ పార్టీలు – జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీ మిత్రపక్షాలు కావచ్చు, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఇతర పార్టీలు కావచ్చు.. యధాలాపంగా ఈ పరిణామాన్ని తీసుకోకూడదు. ఏదో మామూలు సాంప్రదాయ రాజకీయం, అసెంబ్లీలో



తిట్లు, శాపనార్థాలు కాకుండా.. సమాజంలో అట్టడుగున ఏం జరుగుతున్నదో మనం గమనించాలి.


**శ్రీలంక, నేపాల్ – తమిళనాడు మధ్య తేడా**


'గతంలో అలా సరిగ్గా, సరైన సమయంలో గమనించక పోవటం వల్ల మనం శ్రీలంకలో ఏం జరిగిందో చూశాం. చివరికి రెండు పార్టీలనూ తిరస్కరించి జనతా విముక్తి పెరమున (జేవీపీ) నేత అనూర కుమార దిస్సనాయకేను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా, నేపాల్‌లో బాలేంద్రషా. పెద్ద విప్లవంలా పరిణామాలు జరిగాక, అన్ని ప్రధాన పార్టీలనూ ఇంటికి పంపిచేసి కొత్తగా వచ్చిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ వేదిక ద్వారా బాలేంద్రషాని ప్రధానమంత్రిని చేశారు. కొంత తమిళనాడులో ఆ రకమైన భావజాలం కనిపిస్తుంది. కానీ అక్కడి పరిస్థితులు వేరు. శ్రీలంకలోగానీ, నేపాల్‌లోగానీ ఉన్న పార్టీలు పూర్తిగా ప్రజల మనసుల్లో చాలా అసహ్యాన్ని మూటగట్టుకుని, విశ్వస నీయతను కోల్పోయాయి. లక్షలాది మంది ప్రజల ఆగ్రహ జ్వాలల్లో ప్రభుత్వాలు దగ్ధం అయిపోయాయి. ఒక విప్లవంలా వచ్చి, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్త పార్టీ లొచ్చాయి. తమిళనాడు అలా కాదు. ఉన్నంతలో, దేశంలో సమర్థంగా పనిచేస్తున్నారు. ఆర్థిక ప్రగతి బాగా ఉంది అను కున్నా తిరస్కరించారంటే.. ప్రజలు చాలావేగంగా జీవితాల్లో మార్పు రావాలని కోరుకోవటం ప్రస్ఫుటమవుతోంది. ప్రజలకు నచ్చచెప్పగలగాలి. మార్పు అంత వేగంగా జరగక పోవచ్చని తెలియచెప్పాలి. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రజలకు భాగస్వామ్యం కల్పించగలగాలి. ఈ రాజకీయం ఇప్పటిదాకా ఉన్నట్లుగా, 30 కోట్లు ఇచ్చిన వాడికే ఎమ్మెల్యే

సీటు, ఫలానా కులం వాడికే పదవులు, నా కుటుంబంలో వాడికే పదవులు అన్నది బహుశా ఇక చెల్లదు. చూడాలి. ఎందుకంటే, టీవీకే పార్టీ ఓట్లకు డబ్బులు పంచినట్లు కూడా దాఖలాలు లేవు. మిగతా దక్షిణాది రాష్ట్రాలలో కేరళం మిన హాయిస్తే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లాగా తమిళ నాడులోని పార్టీలూ పుష్కలంగా డబ్బు పంచు తున్నాయి. డబ్బులున్నవారికే ఎన్నికల్లో సీట్లు ఇస్తున్నాయి. కానీ విజయ్ పార్టీ అలా కాదు. డబ్బుల ప్రభావం లేకుండా నెగ్గారని చెబుతున్నారు. ఉన్నంతలో మంచి పరిపాలన ఉన్నా కూడా. ఇది ఆలోచించదగ్గ అంశం. ఆహ్వానించదగ్గ అంశం. అదే సమయంలో కొంచెం జాగ్రత్తతో వ్యవహరించాల్సిన అంశం. లేకుంటే, సకాలంలో మన రాజకీయ వ్యవస్థ సరిగా స్పందించకపోతే ప్రమాదానికి అవకాశముంది.

**చిరు, పవన్, కమల్ లకు దక్కని విజయం**

'చిరంజీవి, పవన్ కళ్యాణ్, రజనీకాంత్, కమల్ హాసన్ లాంటి వారికి దక్కని విజయం విజయ్ పార్టీకే ఎందు కొచ్చిందంటే.. చెప్పలేం. అది మనకు తెలుసు అనుకుంటే, మనల్ని మనం మోసం చేసుకోవటమవుతుంది. చిరంజీవి గారి ప్రజారాజ్యం పార్టీ కావచ్చు, పవన్ కళ్యాణ్ జనసేన కావచ్చు, ఇంకా ఇతర పార్టీలు కావచ్చు.. పాతుకుపోయిన పార్టీలు బలంగా ఉన్నప్పుడు, రెండు పార్టీల మధ్య గట్టి పోటీ ఉన్నప్పుడు, మూడవ పార్టీకి మన ఎన్నికల వ్యవస్థలో స్థానం చాలా తక్కువ. కాబట్టి, ఆశ్చర్యమేమీ కాదు. నేను కూడా ఊహించినది – ఎన్నికల సమయంలో సమాచారం ప్రకా రం.. చిరంజీవి గారి ప్రజారాజ్యానికి వచ్చిన 18% దాకా ఓట్లు టీవీకేకి వస్తాయని. సుమారుగా ఆ రకంగానే సీట్లు వస్తాయనుకున్నా. అంటే, ఒక ప్రభావశీల పార్టీగా ఉంటుందిగానీ, ఎన్నికల్లో గెలిచే స్థాయి ఉండదు. అంటే, ఉదాహరణకు డీఎంకే ఓట్లు టీవీకేకు పడితే.. ఆ మేరకు టీవీకేకు కొంత లాభం జరిగి డీఎంకే నష్టపోతుంది. అదేవిధంగా ఏఐడీఎంకే. కానీ అసలు ప్రధాన పార్టీలనే పక్కనపెట్టి టీవీకేయే విజయం సాధించే అవకాశం వస్తుందని అసలు మనం ఊహించలా. అంచేత, రకరకాల కారణాలుంటాయి. కానీ నాకు అనిపించినంత వరకూ.. ప్రజల్లో వేగంగా మార్పు రావాలనే కోర్కెకు టీవీకే సంచలన విజయం ఒక సంకేతం. సాంప్రదాయ రాజకీయాలు ఉన్నవి ఉన్నట్లు కొనసాగిస్తే, అంటే, డబ్బు, కులం వంటివి తప్ప.. సామర్థ్యం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చటం, మౌలిక మార్పులు తేవటం మాకు అనవసరం అనే రకంగా వ్యవహరిస్తే– ఇక కాలం చెల్లినట్లే. అయితే అక్కడి ప్రజలతో నేరుగా మాట్లాడకుండా, మనం కచ్చితంగా ఇది ఏస్థాయిలో






మార్పు అనేది చెప్పలేం. పాతకుపోయిన పార్టీల మధ్య ప్రజా రాజ్యం వంటి పార్టీలు గెలవకపోవటం ఆశ్చర్యకరం కాదు, కానీ టీవీకే గెలవటం దిగ్భ్రాంతికరం, ఆశ్చర్యకరం. ఇది మనం పరిశీలించాలి.


**సగానికి పైగా పట్టణీకరణ ఉన్నా ఆ రకమైన తీర్పు**


'అందునా ఆర్థిక ప్రగతి, పారిశ్రామికీకరణతోపాటు పట్టణీకరణ 55% దాకా ఉన్న రాష్ట్రం తమిళనాడు. ఢిల్లీ, గోవా తర్వాత అతి ఎక్కువ. పట్టణీకరణ ఉన్న చోట్ల కొంత ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, సంపద సృష్టి ఉంటాయి. అందువల్ల, రాజకీయంలో కొంత పరిణతి అవకాశ ముంటుంది. అలాంటి రాష్ట్రంలో ప్రజలు మరింత వేగంగా మార్పును కోరుకుంటున్నారని అనుకోవాలి. ముఖ్యంగా, అట్టడుగు వర్గాలు. యువతగానీ, దళితులుగానీ, మైనా రిటీల్లో పేదలుగానీ కోరుకుంటున్నారు. అంత అద్భుతాన్ని రోజుల్లో చేసే శక్తి ఎవరికీ లేదు. లాటరీలో మీకు అర్జంటుగా డబ్బులొస్తే కోటీశ్వరులు కావచ్చు గానీ, అకస్మాత్తుగా అందరినీ మిలియనీర్లను చేసే శక్తి ఎవరికీ లేదు. ఆర్థిక ప్రగతి రావాలంటే, కొంతకాలం పాటు ఆ కుటుంబాలు, మన సమాజం కష్టపడవలసిందే. క్రమక్రమంగానే జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దానికి ప్రజల్ని తయారు చేయాలి. అందులో భాగస్వాముల్ని చేయాలి. ఉదాహరణకు, విజయ్ ప్రతిపాదించినదాంట్లో రెండున్నాయి. ఒకటి, దక్షిణాదిన ఇతర రాష్ట్రాలోని సంక్షేమ పథకాలన్నిటినీ తీసు కొచ్చి కాస్త అటూఇటుగా తమిళనాడులో కొత్తగా ప్రకటిం చటం. ఆంధ్రప్రదేశ్‌లోని 'అమ్మఒడి'ని ఇక్కడా ప్రకటిం చారు. అదేవిధంగా, మహిళలకు తలసరి నెలకు రూ.2500. పుట్టిన బిడ్డకు ఉంగరం. పెళ్లి చేసుకునే అమ్మా యిలకు 8 గ్రాముల బంగారం. నిరుద్యోగభృతి. తమిళ నాడులో సంక్షేమ పథకాలను డీఎంకే, ఏఐ డీఎంకే చాలా కాలంగా అమలు చేస్తున్నాయి. అయినా, తాత్కాలిక తాయి లాలను ఇస్తున్నా, తమ జీవితాల్లో మరింత వేగంగా మార్పు రావాలనే కోర్కె ప్రజల్లో ఉన్నది. ప్రస్తుత సాంప్రదాయ రాజకీయం మీద విరక్తిని ప్రజలు ప్రదర్శించారు.

**అహం వీడి ప్రజల్ని గౌరవించండి**

'బలంగా పాతుకుపోయిన ఈ సాంప్రదాయ పార్టీలు తమ అహంకారాన్ని ఇకనైనా వీడాలి. పాతపద్ధతుల్ని కొనసాగిస్తే, ప్రజలు ఎక్కడికి పోతారు అనుకుంటే.. ప్రమాదానికి, అస్థిర




త్వానికి దారితీయవచ్చు. ఏ మార్పుని ఎందుకు తీసుకు రావాలి అనే శోధన పార్టీల్లో చిత్తశుద్ధితో జరగాలి. డీఎంకే, ఏఐడీఎంకేకి ఇంతబలంగా వ్యతిరేకత ఉందన్న భావం ఎన్నికల ముందు ఎవరూ గమనించలేదు. అలాగే రెండు పార్టీలూ తుడిచిపెట్టుకుపోలేదు. అందరూ 20% ఓట్ల స్థాయిలో ఉండగా.. డీఎంకే, అన్నాడీఎంకే కంటే కొంత ఎక్కువగా టీవీకే 30%పైగా సాధించింది. కచ్చితంగా ఈ దేశంలో మనకు తెలియనిది జరుగుతోంది. ఒకపక్కన నేను ఇందాక చెప్పినట్లు – ప్రజాస్వామ్యం అన్నా, ప్రజలు అన్నా, ఎన్నికలు అన్నా మనకు గౌరవం పెరగాలి. రెండో కంటికి తెలియకుండా, ఎవరూ ఊహించకుండా, ప్రజలు ఇంత నిశ్శబ్దంగా, డబ్బును, సాంప్రదాయ రాజకీయాన్ని పక్కన పెట్టి ఓట్లు వేస్తారని ఎవరూ ఊహించివుండారు. అంటే, ప్రజలకి ఎన్నికలనాడు ఎంతో బలముంది. ఎంత మార్పుని పూర్తి శాంతియుతంగా, ఏ హింస లేకుండా, నిశ్శబ్దంగా ప్రజలు సాధించగలుగుతున్నారటానికి తమిళనాడు గొప్ప ఉదాహరణ. అదేవిధంగా, అసంతృప్తి, శరవేగంగా మార్పులు కావాలనే కోర్కె ఉంది. శరవేగంగా అంత మార్పు తేవటం ఎవరికీ సాధ్యం కాదు. కాబట్టి ఒక రకంగా – పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో దళితులు, యువతకు ఎలా భాగస్వామ్యం కల్పించాలి? వారి అసంతృప్తికి, ఆకాంక్షలకు ఎలా వ్యక్తీకరణను ఇవ్వాలి? సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని ఎలా సాధించాలి?.. అనేవి రాజకీయ వ్యవస్థ పట్టించుకోవాల్సి ఉంది. నిజమైన ప్రజాస్వామ్యంతో అధికార వికేంద్రీకరణ, అందులో ప్రజలకు భాగస్వామ్యం కల్పించటానికి విజయ్ తన సంచలన విజయాన్ని ఉపయోగించగలిగితే తమిళ నాడుకి, దేశానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.

**పశ్చిమ బంగ–కేరళం–అసోం–పాండిచ్చేరి**

'ఇక పశ్చిమ బంగలో 34 ఏళ్లపాటు అధికారంలో ఉన్న సీపీఎం ప్రభుత్వాన్ని ఎంతో కష్టపడి పోరాడి మమతా బెనర్జీ టీఎంసీని అధికారంలోకి తెచ్చారు. 15 ఏళ్లపాటు ఆమె అధికారంలో ఉన్నారు. మూడున్నర దశాబ్దాలపాటు అధికారంలో ఉన్నా కమ్యూనిస్టు మార్క్సిస్ట్ పార్టీ వారు ఆర్థికాభివృద్ధిని, మౌలిక వసతుల్ని, శాంతిభద్రతల్ని పట్టించు కోలేదు. మమతా బెనర్జీ పాలన వచ్చాకైనా మార్పు వస్తుందనుకుంటే, ఆమె కూడా సీపీఎం నమూనాలోనే సాగారు. పార్టీ మారిందిగానీ, అధికారాన్ని వినియోగించే తీరు మారలేదు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అమ లు చేస్తున్న ఆర్థిక క్రమశిక్షణ, అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, శాంతిభద్రతల పరిరక్షణ మొదలైన అంశాల నమూ నాకి పశ్చిమ బంగ ప్రజలు మద్దతు పలికారు. బహుశా ఇప్పుడు పాలన మారి ఆ రాష్ట్ర ప్రజలకు ఆశించిన మంచి జరిగే అవకాశం ఉంది. ఇక అసోంగానీ, పాండిచ్చేరిగానీ అనుకున్న ఫలితాలే. అదేవిధంగా, కేరళంలో కూడా రెండుసార్లు వరుసగా గెలిచి గత 50–60 ఏళ్లలో రికార్డు సృష్టించిన సీపీఎం ప్రభుత్వం, ఈసారి మారుతుందని అందరూ అనుకున్నదే. కానీ ఆ రాష్ట్రంలో ఎవరొచ్చినా సుపరిపాలనా పద్ధతుల్ని మార్చరు. దేశంలో ఎక్కడాలేని రీతిలో కేరళంలో స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి గట్టి పునాదినిస్తున్నాయి. వాటిని కొత్తగా వచ్చిన యూడీఎఫ్ ప్రభుత్వమేమీ కదిలించలేదు.

'ఏప్రిల్ 2026 అసెంబ్లీ ఎన్నికలు దేశ రాజకీయాల్లో పార్టీలపరంగా పెద్ద మార్పులకు దోహదకారి కావచ్చు గానీ, అంతకంటే కీలకమైనది – ప్రజలను ఎల్లకాలం డబ్బు, తాత్కాలిక తాయిలాలతో మభ్యపెట్టగలం అనే రాజకీయాన్ని మార్చుకుని వారి ఆకాంక్షలకు తగ్గ వేగాన్ని పాలనలో ప్రదర్శించటం; సహనం అనివార్యమైన సందర్భాల్లో వారికి నచ్చచెప్పటం; ముఖ్యంగా స్థానిక ప్రభుత్వాల్లో సాధికార భాగస్వాముల్ని చేయటం ద్వారా వారికి అనుభవపూర్వకంగా పాలన, రాజకీయం అర్థమయ్యేలా చేయటం వంటి మార్పుల్ని సాంప్రదాయ రాజకీయ వ్యవస్థ తీసుకురావాలి. లేకుంటే, ఏం జరుగుతుందనేది విజయ్ పార్టీ 'విజిల్' (టీవీకే ఎన్నికల్లో పోటీకి ఉపయోగించిన ఈ గుర్తు లోక్‌సత్తా ద్వారా తెలుగునాట పాప్యులర్ అయింది.

కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ, తమిళనాడులో 'మక్కల్ శక్తి కట్చి' పేరుతోనూ లోక్‌సత్తా 'ఈల' గుర్తుతోనే పోటీచేసింది) వేసి మరీ చెప్పింది. ఆడలేక ప్రజాస్వామ్యం ఓడు అనుకోకుండా ఈ మార్పులకు నేతలు వ్యవస్థీకృతంగా స్పందించటం పార్టీలకు, భారతదేశానికి కూడా మంచిది. ♦

# డీలిమిటేషన్ - మహిళా రిజర్వేషన్ .. దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్ గోల్

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



బడ్జెట్ సమావేశాలకు కొనసాగింపుగా ఏప్రిల్ 16-17న జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఉత్కంఠభరితంగా, వాడివేడిగా ముగిసింది. ఎండా కాలం దుమారాన్ని తలపించేలా మాటల దాడులు హోరెత్తాయి. వేడి చల్లారాక ఇప్పుడు వెలుతురు ప్రసరిస్తోంది. ఆవేశం స్థిమితపడి తర్కం, ఆత్మవిమర్శ మొదలయ్యాయి. గెలుపోటములకు అతీతంగా ఏదో అసాధారణ పరిణామం అత్యున్నత చట్టసభలో చోటు చేసుకుందని అర్థమవసాగింది. అనుమానం పెనుభూతమై అసలుకే మోసం తెచ్చుకున్నామా? అనే మీమాంస మొదలైంది.

లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు సీట్లు పదిహేనేళ్లపాటు విధిగా కేటాయించటం ఇప్పటికే 106వ సవరణ రూపంలో రాజ్యాంగంలో భాగమైంది. ఇప్పుడు లోక్‌సభలో వీగిపోయిన 131వ సవరణ ద్వారా రెండు కీలక మార్పులు సంకల్పించారు. మహిళలకు సీట్ల కేటాయింపుని, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ని 2026 జనగణనతో సంబంధం లేకుండా చేయటం; లోక్‌సభ సభ్యుల సంఖ్యని యాభై శాతం పెంచటం.

2026 జనగణన పూర్తయ్యేవరకూ వేచివుండాల్సిన అవసరంలేకుండా నియోజకవర్గాల పునర్విభజనను వేగవంతం చేయటం, 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆ ప్రక్రియను పూర్తి చేయటం ఇందులో సానుకూలాంశం. గత 25 ఏళ్లకు పైగా, పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోంది. దీంతో, నియోజకవర్గాల మధ్య పరిమాణంలో అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఉదాహరణకు, తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మల్కాజిగిరి నియోజకవర్గ జనాభా 50 లక్షలకు పైగా ఉంది. ప్రపంచంలోని 90 దేశాలు ఈ ఒక్క లోక్‌సభ స్థానం కంటే చిన్నవి. కాబట్టి, డీలిమిటేషన్ అవసరం.

వీగిపోయిన బిల్లులు పార్లమెంటుకిచ్చిన అధికారమల్లా - డీలిమిటేషన్‌కి ప్రాతిపదికగా తీసుకోవాల్సిన జనగణన సంవత్సరాన్ని నిర్ణయించటం. 2029 నాటికల్లా మొత్తం పునర్విభజనను పూర్తి చేయటానికి.. ఇప్పటివరకూ చివరిగా అందుబాటులో ఉన్న 2011 డీలిమిటేషన్ గణాంకాలను పార్లమెంటు ఆధారం చేసుకుంది. సభలో అధికారిక ప్రకటనలు ఈ మేరకు సూచించాయి.

లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచటం అనేకమందిలో ఉత్కంఠ రేపినట్లు కనిపిస్తుంది. కానీ మహిళా రిజర్వేషన్ లేదా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు అంశాలకు, దీనికి ప్రత్యక్ష సంబంధమేమీ ఉండదు. మన జనాభా భారీగా పెరిగిన రీత్యా, ప్రతినిధుల సంఖ్యను పెంచటం సబబైన ప్రతిపాదన. కానీ సగటు రాజకీయంలో కొట్టుకుపోకుండా పరిశీలిస్తే.. మహిళా ప్రాతినిధ్యం నేపథ్యంలో లోక్‌సభ బలాన్ని పెంచటం వల్ల ఒక నిజమైన ప్రయోజనాన్ని మనం గమనించవచ్చు: దీనివల్ల, ప్రస్తుతం సభ్యులుగా ఉన్నవారిలో చాలామంది బలవంతంగా తమ స్థానాల్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి తలెత్తదు. అదే, సీట్ల సంఖ్యను పెంచకుండా మహిళలకు రిజర్వేషన్ అంటే, పురుష రాజకీయవేత్తలు చాలా సందర్భాల్లో తమ కుటుంబాల్లోని మహిళల్ని కీలుబొమ్మ అభ్యర్థులుగా నిలబెడతారు. ఇదేమీ అకారణ భయం కాదు. అప్పుడు మహిళా సాధికారత మొక్కుబడి తంతులా మారుతుంది. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటినమ్మ వాయనం పద్ధతిలో నిజమైన నాయకత్వం ఆవిష్కృతమవదు. ఇప్పటికే మన స్థానిక ప్రభుత్వాల్లో 'పంచ్‌పతులు'గా పిలు చుకునే ఓ ఆనవాయితీ ప్రబలింది. అక్కడ మహిళలు రిజ ర్వేషన్ ద్వారా ఎన్నికైనా, పేరుకే నాయకురాళ్లు. భర్తో, తండ్రో నిజమైన అధికారాన్ని చెలాయిస్తారు. ఈ కోణంలో లోక్‌సభ సీట్ల సంఖ్య పెంచటం మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ప్రాధాన్యాంశం. ఇది మినహాయించి.. లోక్‌సభ బలానికి, రిజర్వేషన్లకి సంబంధం లేదు.

కానీ ప్రభుత్వం పరిష్కరించటానికి ప్రయత్నించిన పెద్ద సవాలు - లోక్‌సభలో రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు. ఇది

జటిలమైన, సున్నితమైన, రాజకీయ విమర్శలకు ఆస్కారమున్న అంశం. ప్రతి రాష్ట్రానికీ సీట్ల కేటాయింపుని ఏ పద్ధతిలో చేయాలో రాజ్యాంగంలోని 81 (2) అధికరణంలో పేర్కొన్నారు. "సీట్ల సంఖ్య ఆచరణలో వీలైనంత వరకు రాష్ట్ర జనాభాకు నైష్పత్తికంగా ఉండేలా పునర్విభజన చేయాలి. అన్ని రాష్ట్రాలలో ఇంచుమించు ఇదే తరహాలో ఉండాలి". 82వ అధికరణం కూడా పేర్కొంటుంది: ప్రతి కులగణన తర్వాత, లోక్‌సభకు రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని.... తదను గుణంగా మార్పుచేర్పుల్ని చేయాలి...

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్లను 25 ఏళ్ల పాటు యధాతథంగా కొనసాగించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆ చర్య తీసుకున్నారు. 2001లో సీట్ల సంఖ్యలో ఆ స్తంభన వ్యవధి ముగిసింది. అయితే రాష్ట్రాలకు కేటాయించిన సీట్లలో యధాతథ స్థితిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని అప్పటి వాజపేయి ప్రభుత్వాన్ని ఒప్పించటంలో నేను కీలక పాత్ర పోషించాను. అందుకోసం మేం జాతీయ స్థాయిలో ఒక రౌండ్‌టేబుల్ నిర్వహించాం. అప్పటి న్యాయశాఖా మంత్రి అరుణ్‌జైట్లీ; జేఎం లింగ్డో నేతృత్వంలో ముగ్గురు ఎన్నికల సంఘం సభ్యులు; అన్ని రాష్ట్ర ఎన్నికల సంఘాల కమిషనర్లు, ఈ రంగంలో నిపుణులు హాజరయ్యారు. అప్పటి ప్రభుత్వం రకరకాల పార్టీల అతుకులబొంత సంకీర్ణంగా ఉంది. ఇదేసమయంలో పోఖ్రాన్ అణు విస్ఫోటనం నేపథ్యంలో విదేశాల ఆంక్షల వల్ల ఎదురవుతూ ఆర్థిక సవాళ్లు తీవ్రతరమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో పునర్విభజన తుట్టెను కదిలించటం సమస్యలకు దారితీయవచ్చు. జాతీయ సమగ్రత అత్యంత ప్రాధాన్యాంశం.. అని మేం విజ్ఞప్తి చేశాం. పార్టీలు స్పందించాయి. 84వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చాయి. 2026 వరకు రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల కేటాయింపును నిలుపుచేశాయి.

సవరణలేకుండా 2026 జనగణన ఆధారంగానే సీట్లను కేటాయిస్తే, రాజ్యాంగం ప్రకారం ఏడు రాష్ట్రాలు ప్రస్తుత లోక్‌సభ బలంలో 35 సీట్లను కోల్పోతాయి. ఆంధ్రప్రదేశ్ (−5), తెలంగాణ (−3), తమిళనాడు (−10), కర్ణాటక (−2), కేరళం (−7), ఒడిశా (−4), పశ్చిమ బెంగాల్ (−4). నాలుగు రాష్ట్రాలు 34 సీట్ల మేర అదనంగా పొందుతాయి. యూపీ (+12), బీహార్ (+10), మధ్యప్రదేశ్ (+5), రాజస్థాన్ (+7). 2026 జనాభా ప్రకారం వివిధ రాష్ట్రాలకు అలా సీట్ల పంపకం జరిగితే, బీజేపీయే ప్రధానంగా లాభం పొందుతుందనేది ఎక్కువమంది అంగీకరించే అభిప్రాయం. అయితే, ఎవరూ ఊహించనిరీతిలో.. తన ప్రయోజనాలకు

## రాజ్యాంగంలో ఎక్కడా 'కేంద్రం' అనే మాట లేదు.. అసలు సమస్య స్థానిక ప్రభుత్వాల్లో ఉంది

భారత రాజ్యాంగంలో ఎక్కడా కేంద్రం లేదా కేంద్ర ప్రభుత్వం అనే మాట లేదు. క్వాజీ ఫెడరల్ వ్యవస్థగా పేర్కొన్నారు. భారత పార్లమెంటు 2వ అధికరణం ప్రకారం సాధారణ మెజారిటీ ద్వారా చట్టం తెచ్చి కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. 3వ అధికరణం ప్రకారం ఒక రాష్ట్రం విస్తీర్ణం పెంచవచ్చు, తగ్గించవచ్చు. ఒక రాష్ట్రాన్ని రెండు ముక్కులగా విడగొట్టవచ్చు. లేదా ఎక్కువ రాష్ట్రాలను కలపవచ్చు. లేదా కేంద్రపాలిత ప్రాంతాలను కలిపి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయవచ్చు. అంటే, మన రాజ్యాంగం ప్రకారం అసలు రాష్ట్రాల ఉనికే పార్లమెంటు మీద ఆధారపడి ఉంది.

+ రాష్ట్రాలను మార్చటానికి అసలు రాజ్యాంగ సవరణ అక్కర్లేదు.

+ రాష్ట్రాల శాసనసభ సభ్యుల అభిప్రాయాలు కీలకం.

+ మొత్తం దేశాన్ని ఒక రాష్ట్రంగా మార్చే అధికారం పార్లమెంటుకి ఉంది.

+ కాగితం మీద ఇలా ఉన్నా పార్లమెంటులో మన నేతలు చాలా సంయమనం పాటించారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ విభజనే అసెంబ్లీ తీర్మానానికి వ్యతిరేకంగా చేశారు. అపార ప్రజాదరణ ఉన్నా.. నెహ్రూ ఈ విషయంలో ఎంతో ముందుచూపుతో వ్యవహరించారు. హిందీ భాషకు వ్యతిరేకంగా తమిళనాడులో ఆందోళనలు వచ్చినప్పుడు, వెంటనే ఆయన వెనక్కి తగ్గి, వారి మనోభావాల్ని గౌరవించారు. అదేవిధంగా, 1969, 1973లో తెలంగాణ, జైఆంధ్ర ఉద్యమాలు వచ్చినప్పుడు ఇందిర అన్ని ప్రాంతాల అభిప్రాయాలనూ పరిగణలోకి తీసుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు.

+ ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం అనే దృక్పథం నుండి కాకుండా, రాజ్యాంగం పేర్కొన్న యూనియన్ తరహాలో ఆలోచించి, డీలిమిటేషన్ ప్రక్రియను ఏకాభిప్రాయ సాధనతో చేయాలనే సంకల్పాన్ని ప్రదర్శిస్తే ఎటువంటి ఒడిదుడుకులూ ఉండవు. భారత్ కీలకమైన ఆర్థికాభివృద్ధి దశలో ఉన్నప్పుడు, ఇలాంటి అంశాలతో సమయం వృధా అవదు.

+ 2001లో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ప్రధాన ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల సంఘం బాధ్యులు డీలిమిటేషన్ కమిటీలో ఉన్నారు. ఆ అంశంపై కె.సి శివరామకృష్ణన్ విశ్లేషణలు, జేపీ విధానపరమైన సూచనల్ని పరిగణలోకి తీసుకున్నారు. 2026 వరకు నియోజకవర్గాల పునర్విభజనను నిలుపు చేయటంతోపాటు.. నియోజకవర్గాల సంఖ్య పెంచకుండా సరిహద్దుల్ని మార్చుకునే వెసులుబాటునిచ్చారు. ఈ రకంగానే 2002-08 మధ్య కొన్ని నియోజకవర్గాల సరిహద్దుల్నిసౌలభ్యం కోసం మార్చారు. అదేవిధంగా, గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలపి నియోజకవర్గాలు, జిల్లా పరిధిలోపలే అందులోని

విరుద్ధంగా ఎన్‌డీయే ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్రాల వాటాని 1971 జనగణన డేటా ఆధారంగా స్తంభింపచేయటానికి ముందుకొచ్చింది. బీజేపీ అలా యధాతథస్థితిని కొనసాగించటానికి చొరవ చూపటానికి అనేక కారణాలుండొచ్చు. పార్టీ కంటే దేశం మిన్న, దక్షిణాదిలో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవాలనుకోవటం, అంతర్జాతీయ ఆర్థిక ఒడిదుడుకుల నేపథ్యంలో దేశం అనివార్యంగా అభివృద్ధి, ప్రగతి మీద సర్వశక్తులూ కేంద్రీకరించాల్సి ఉండటం, ఇలాంటి కీలక తరుణంలో విభజన కారక అంశాన్ని పక్కనపెడదామనుకోవటం.. వంటి ఆలోచనలు ఉండుండొచ్చు. బీజేపీ చొరవకి కారణం ఏదైనా, జనాభా పరంగా సీట్లు కోల్పోతున్న ఏడు రాష్ట్రాలకూ ఊహించని బహుమతిని ప్రతిపాదించింది. ఏదో సామెత చెప్పినట్లు – మేలిమి గుర్రాన్ని బహుమతిగా ఇస్తే, పళ్లు సరిగా ఉన్నాయా అని వెతికినట్లుంది.

దక్షిణాదిన, తూర్పు భారతంలో బలమైన ఉనికి ఉన్న పార్టీలు ఇలా భారీ సెల్ఫ్ గోల్ గావించుకోవటం ఆశ్చర్యం, దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ముఖం మీద కోపంతో ముక్కు తెగ్గోసుకోవటానికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ ఉండదేమో. మీ ప్రయోజనాలు, దేశ ఐక్యతకు దోహదం చేసే అంశాల్ని, అభివృద్ధి, సామరస్యతలను విస్మరించే స్థాయిలో రాజకీయ శతృత్వం మిమ్మల్ని కమ్మేస్తే, అది రాజకీయం కాదు. ప్రజాజీవితంలో నిష్క్రియకు అది అతి పెద్ద సంకేతం.

ఈవేళ జనాభా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నియంత్రణలోకి వస్తోంది. ఢిల్లీ (1.4), తమిళనాడు (1.4), పశ్చిమ బెంగాల్ (1.4), ఆంధ్రప్రదేశ్ (1.5), తెలంగాణ (1.5), హిమాచల్ ప్రదేశ్ (1.5), జమ్మూ కశ్మీర్ (1.5), కేరళం (1.5), మహారాష్ట్ర (1.5), పంజాబ్ (1.5), కర్ణాటక (1.6), ఒడిశా (1.8), ఉత్తరాఖండ్ (1.8). కొన్నేళ్లలో వలసలు అసమతుల్యతలను సరిచేస్తాయి. ఇప్పటికే కోట్లాదిమంది కార్మికులు దక్షిణాదిన, పశ్చిమ, ఉత్తరాదిన పలు రాష్ట్రాలు ఆర్థిక వ్యవస్థల్ని నిర్మిస్తున్నారు. సుస్థిర పరుస్తున్నారు. అందుకే, జననాల రేటు తక్కువగా ఉన్నా, జనాభాలో మహారాష్ట్ర వాటా పెరుగుతోంది. అమెరికాలో దేశం లోపల భారీ వలసలు సాధారణం. ఈ సంస్కృతి అక్కడి జనాభా సంఖ్యని, ప్రాతినిధ్యాన్ని కొన్నేళ్లలో గణనీయంగా మార్చేసింది. అక్కడేమీ జనాభా ప్రత్యేకించి కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ పెరగలేదు. కానీ ఎక్కడ అభివృద్ధి, ఉద్యోగాలు ఉన్నాయో, ఆ రాష్ట్రాలకు ప్రజలు స్వేచ్ఛగా వలస వెళ్లారు, వెళ్తుంటారు. దీంతో.. ఒక శతాబ్దంలో, ఫ్లోరిడా రాష్ట్రం అమెరికా కాంగ్రెస్‌లో తన ప్రాతినిధ్యాన్ని 4 నుండి 28కి పెంచుకుంది. కాలిఫోర్నియా 11 నుండి 52కి, టెక్సాస్ 18 నుండి 38కి, వాషింగ్టన్ 5 నుండి 10కి పెంచుకున్నాయి. స్థానికులు బయటకు వలసలు పోవటం వల్ల న్యూయార్క్ సీట్లను కోల్పోయింది. అక్కడ ప్రాతినిధ్యం 43 నుండి 26కి తగ్గింది. అదేవిధంగా, పెన్సిల్వేనియా 36 నుండి 17కి, ఇల్లినాయిస్ 27 నుండి 17కి, ఓహియో 22 నుండి 15కి, మిస్సోరి 16 నుండి 8కి సీట్లను కోల్పోయాయి.

ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లటాన్ని మనమూ సులభతరం చేయాలి. వారు ఏ రాష్ట్రంలో ఉన్నా, వారి రాజ్యాంగ హక్కులను గౌరవించాలి. ఎక్కడుంటే అదే వారి రాష్ట్రం కావాలి. అలా వారి జీవితాల్ని సౌకర్యవంతంగా, సురక్షితంగా మార్చాలి. ఆ మార్పు మన జనాభా సవాళ్లను పరిష్కరిస్తుంది. అనేక పెద్ద రాష్ట్రాలు ఇప్పటికే తక్కువ జననాల స్థాయికి చేరు కున్నాయి. బీహార్, ఉత్తర్ ప్రదేశ్, జార్ఖండ్ కూడా కొన్నేళ్లలో వాటిని చేరుకోనున్నాయి. కలసికట్టుగా ఎదగటానికి, బలోపేతమవటానికి మనం హేతుబద్ధ, ఆచరణసాధ్య పద్ధతిని పాటించాలి. ద్వేషాన్ని పెంచే, విభజించే ప్రసంగాలు, ప్రచారాలకు స్వస్తి చెప్పాలి. అందరికీ నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, అవకాశాలు మెరుగైన భవిష్యత్తుకి కనీస అవసరాలు. జాతీయ సమైక్యత, అవకాశాలు, అభివృద్ధి కోసం మన అన్వేషణ.. రాష్ట్రాలకు సీట్ల కేటాయించటంపై త్వరిత, సామరస్య తీర్మానానికి దోహదం చేయాలి. ♦

...

నియోజకవర్గాల ఏర్పాటు, జాతీయ-రాష్ట్ర-స్థానిక ప్రభుత్వాలకు ఒకే ఓటరు జాబితా మొదలైన సిఫార్సుల్ని ఈ కమిటీ ప్రభుత్వానికి చేసింది.

నియోజకవర్గాల పునర్విభజన ఒక ఒడంబడిక. వచ్చే 30-40 ఏళ్లలో అన్ని రాష్ట్రాలూ జనాభా నియంత్రణలో స్థిరత్వాన్ని (2.1 టీఎఫ్ఆర్) సాధిస్తాయి. కాబట్టి, ఇదో జటిల సమస్యగా మార్చుకోనక్కర్లేదు. జనాభా నియంత్రణ మనం సాధించిన అద్భుత విజయం. దీని వల్ల నష్టపోతున్నామనుకుంటూ, ఇంకా జననాల రేటు పెంచుకోవటం కోణంలో ఆలోచించటమంటే.. విజయం కోరల్లో నుండి అపజయాన్ని తీసుకునే ప్రయత్నం చేయటం. ఇప్పుడు డీలిమిటేషన్ వల్ల మహాఅయితే 6% సీట్లు తేడా వస్తాయి (కొత్తగా నిర్మించిన పార్లమెంటు లోక్ సభ భవనంలో 888 మంది ఎంపీలకు సరిపడా సీట్లు ఉన్నాయి). దీనివల్ల ప్రాతినిధ్యం ఏ రాష్ట్రానికీ తల్లకిందులైపోదు. అసలు సమస్య స్థానిక ప్రభుత్వాల వైఫల్యంలో ఉంది. ప్రజల రోజువారీ జీవితంలో 80% అవసరాలకు కీలకమైన స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్రాలు సగం నిధులిచ్చి, వాటిని యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలతో సమానంగా మూడో అంచె ఫెడరల్ వ్యవస్థగా పరిగణిస్తే, ఇంత చర్చే అవసరం ఉండదు. ఫెడరలిజం 2.0 లక్ష్యం పూర్తిగా నెరవేరి భారత్ మరింత బలమైన సమాఖ్య దేశంగా రూపుదిద్దుకుంటుంది.

# ‘డీలిమిటేషన్-మహిళా రిజర్వేషన్’ రాజ్యాంగ సవరణ చర్చ



ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పరిమితి కొరవడటం, దక్షిణాది కొంత మెరుగ్గా ఉండటంతో.. అంతరాన్ని సరిచేసేందుకు 1976లో ప్రధాని ఇందిర 42వ రాజ్యాంగ సవరణతో నియోజకవర్గాల పునర్విభనను 2001 వరకు నిలుపు చేశారు. ఆ తర్వాత వాజపేయి హయాంలో.. సంకీర్ణ ప్రభు త్వం, పోఖ్రాన్ అణుపరీక్ష నేపథ్యంలో అమెరికా ఆంక్షల రీత్యా కేసీ శివరామకృష్ణన్ కమిటీ, జేపీ లాంటి వారి చొరవతో మరో పాతికేళ్లు స్తంభింపచేశారు. కానీ 2026 వచ్చేసినా.. జననాల రేటు (టీఎఫ్ఆర్)లో దక్షిణాది రాష్ట్రాలు సాధించిన ప్రమాణాన్ని పలు ఉత్తరాది రాష్ట్రాలు సాధించ లేకపోయాయి.

దీనివల్ల 2026-27 జనగణన ప్రకారం ఉత్తర్ ప్రదేశ్, బీహార్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికన అదనంగా సీట్లు పొందే అవకాశం ఉండగా, దక్షిణాది 20-30 ఎంపీ సీట్లు కోల్పోయే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే, గత రెండేళ్లుగా దక్షిణాది రాష్ట్రాలు ఫెడరలిజం పతాకం కింద ఆందోళనలు చేస్తున్నాయి. కొన్ని సదస్సుల్ని నిర్వహించటంతోపాటు.. కేంద్ర-రాష్ట్ర సంబం ధాలు సమీక్షించటానికి జస్టిస్ కురియన్ కమిటీని కూడా తమిళనాడు అప్పటి ముఖ్యమంత్రిగా స్టాలిన్ ఏర్పాటు చేసి అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే తొలి నివేదికను విడుదల చేశారు. కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారం భించిన వెంటనే మొదటి బిల్లుగా 2023 సెప్టెంబర్‌లో మహి ళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను (నారీ శక్తి వందన్ అభినియం) ప్రవేశపెట్టి ఆమోదింపచేశారు. అయితే 2026 కులగణన, డీలిమిటేషన్ పూర్తయిన తర్వాత ఆ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం వల్ల గరిష్టంగా 2034 దాకా సమయం పట్టే అవకాశం ఉందని అంచనా. అయితే ఎం దుకో యూనియన్ ప్రభుత్వం మనసు మార్చుకుని 2029 నుండే మహిళా రిజర్వేషన్లు అమలయ్యేందుకు 131వ రా జ్యాంగ సవరణను ఏప్రిల్ 16న లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న సంఖ్యకు నైష్పత్తికంగా 50 శాతం సీట్లు పెంచటం, ఆ సంఖ్యను మహిళల కోటాగా కూడా ఉపయోగించటం ఈ సవరణలో ప్రధానాంశాలు. దీంతోపాటు ప్రవేశపెట్టిన మరో రెండు బిల్లులు డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల్లో సీట్ల పెంపుకి సంబంధించిన సాంకేతికమైనవి, సాధారణ మెజారిటీతో ఆమోదం పొందగలిగినవి. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుకి 2011 జనగణనను ప్రాతిపదిక గావించటం కోసం రాజ్యాంగ సవరణ అవసరమైంది (2011 జనాభా లెక్కల ప్రకారం కూడా దక్షిణాదికి సీట్లు కొంత తగ్గుతాయి). ఈ 131వ సవరణ ఆమోదం ప్రతిపక్షాల మద్దతు కూడా ఉంటేనే సాధ్యం. అయితే, డీలిమిటేషన్‌ను, మహిళా రిజర్వేషన్‌ను కలపటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. మోదీకి రాజకీయ ఎత్తుగడలు ఉండొచ్చు. ప్రతిపక్షాలు హేతు బద్ధ అభ్యంతరాలు లేవనెత్తొచ్చు. ప్రజలకు చేసే ఏ చిన్న మంచి అయినా రాజకీయమే. ప్రామాణికంగా ఉండాలేగానీ.. పార్లమెంటు లోనూ రాజకీయ చర్చ బలంగా చేయవచ్చు. కానీ అలాంటివేవీ కూడా గంటల తరబడి వాదోపవాదాల్లో వినిపించలేదు. డీలిమిటేషన్‌కి, మహిళా రిజర్వేషన్ చట్టం

అమలుని వేరు చేస్తే, మహిళా కోటాకు మద్దతిస్తామని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. చివరికి 528 ఓట్లలో 298-230 తేడాతో ఆ రాజ్యాంగ సవరణ వీగిపోయింది.

ఈ నేపథ్యంలో ముఖ్యంగా దక్షిణాది నేతలు తమ రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత నిచ్చారు. ఈ సంక్షోభాన్ని సమీక్షించుకుని పాఠాలు నేర్చుకోవటానికి, మరో అవ కాశంగా మలచుకుని సద్విని యోగం గావించుకోవటానికి ఉపయోగపడే కొన్ని అంశాల్ని తెలియచేసే ప్రయత్నమిది:

✦ 'ఒక వ్యక్తి - ఒక ఓటు - ఒక విలువ' డీలిమిటేషన్‌కి ప్రాతిపదిక. అందువల్ల జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో రాష్ట్రాలవారీ జనాభాకు విధిగా ప్రాధాన్యత నివ్వాల్సుంటుంది. ఆ సమస్య లేకుండా ఫెడరలిజానికి పెద్ద పీట వేసి రాజ్యాంగసవరణతో 50% గంపగుత్తగా అన్ని రాష్ట్రాలకూ నైష్పత్తికంగా పెంచుతామని చెప్పినా.. ప్రాథమిక పాఠశాల స్థాయి అంకగణితం కూడా తెలియకుండా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాతినిధ్యంగల పార్టీలు, ఎంపీలు వ్యవహరించారు.

✦ నిజానికి దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి పెద్ద బలం లేదు. ముస్లింలు దేశంలో 16% దాకా ఉన్నా, వారి ఓట్లు అక్కర్లేదని ఆ పార్టీ ఒక్క సీటు కూడా కొన్ని రాష్ట్రాల్లో ఇవ్వలేదనే విమర్శ ఉంది. వారు ఎందుకు ఆ పని చేసినా.. మన లాభం మనం చూసుకోవాలి గదా? కానీ సిరికి మోకాలు అడ్డుపెట్టాం.

✦ పేరుకి 2011 జనాభా లెక్కల్ని ప్రాతిపదికగా 131వ సవరణ బిల్లులో పరోక్షంగా పేర్కొన్నప్పటికీ.. 1971 జనాభా లెక్కల్ని ఫ్రీజ్ చేసి అదనంగా యాభై శాతం సీట్లు అన్ని రాష్ట్రాలకూ పెంచినట్లు లెక్క. ఇది దక్షిణాదికి ఎంత ప్రయోజనకరమంటే, ఈ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందివుంటే.. జనాభా ప్రాతిపదికను ఎందుకు ప్రాతిపదికగా తీసుకోలేదని న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశాలు కూడా ఉన్నాయి. రాజ్యాంగ మౌలిక సూత్రాల కోణంలో వారి వాదనల్ని, అలాంటి ప్రయత్నాల్ని సోషల్ మీడియా యుగంలో తోసిపుచ్చలేం.

✦ కేసీ వేణుగోపాల్ ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌లో దక్షిణాది నేత. కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత రాహుల్ ఉత్తరాదిన ఓడిపోతే, ఆయన్ని గెలిపించిన కేరళ రాష్ట్రానికి చెందినవారు. ఇప్పుడున్న స్థానాలు తగ్గకుండా 50% శాతం సీట్లు పెంచుతామని మీరు లిఖితపూర్వకంగా ఇస్తే, మద్దతిస్తామని వేణుగోపాల్ ప్రతిపాదించగానే.. హోం మంత్రి అమిత్‌షా వెంటనే అందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. సంబంధిత సవరణలతో బిల్లుని గంటలోగా సభ్యులందరికీ అందిస్తామన్నారు. ఆయన మాటలు పూర్తిగాకముందే సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ హడావుడిగా లేచి, 'బీజేపీవారు మహిళను ప్రధానమంత్రిగా చేస్తామని రాసి ఇచ్చినా మేం నమ్మం' అన్నారు.

✦ ఇప్పుడున్న పార్లమెంటు ప్రాతినిధ్యానికి అదనంగా ప్రతి రాష్ట్రానికీ 50% పెంచుతామని హోం మంత్రి అమిత్ షా నోటి మాటగా చెప్పటం అవకాశవాదం అనుకోవటంలో తప్పు లేదు. కానీ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ కూడా మౌఖికమైనదే. అయినా అది చట్టంతో సమానమని లోక్‌సత్తా ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీలో న్యాయకోవిదులు తేల్చారని మనం విస్మరించకూడదు.

✦ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ చట్ట సవరణకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానానికి సలహా ఇవ్వటం కోసమంటూ తెలంగాణ ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లారు. అంతకుముందు రాష్ట్రంలో మాట్లాడుతూ.. పెంచే సీట్లలో కొంత జనాభా ప్రాతిపదికన, కొంత జీఎస్టీ ఆదాయం వంటి ఆర్థికాభివృద్ధి అంశాల ఆధారంగా వెయిటేజీ ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచటం అంటే.. జనాభా నియంత్రణ సాధించటంతోపాటు, దేశాభివృద్ధికి దోహదం చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ మూల్యం చెల్లిస్తాయని, ఇది అన్యాయమని ప్రధానికి రాసిన లేఖలో కూడా వాదించారు. ఇందుకు వ్యతిరేకంగా పోరాడదామని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ లేఖ రాశారు. కానీ జనాభా, ఫెడరలిజం, జాతీయస్థాయి ప్రభుత్వ విచక్షణ మినహాయించి.. ఆర్థికాభివృద్ధి డీలిమిటేషన్‌కు ప్రాతిపదిక అనటం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో సరైన ప్రతిపాదన కాదు. అంతేకాదు, బీజేపీ నేత కిషన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు, అదే సూత్రాన్ని అసెంబ్లీ సీట్ల పెంపుకి అన్వయిస్తే.. 70 శాతం సీట్లు హైదరాబాద్, రంగారెడ్డికే రావాల్సుంటుంది.

✦ ఇప్పుడున్న సభ్యుల సంఖ్యతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తే, సవరణకు మద్దతిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి మరో ప్రతిపాదన చేశారు. 2027 ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నుండే మహిళలకు 33% సీట్లు ఇవ్వొచ్చన్నారు. జేపీ చెప్పినట్లు, తమ సీట్లను కోల్పోవటానికి ఇష్టపడని మగమహారాజులు.. ఇప్పటికే ఉన్న సీట్లను మహిళలకు కేటాయిస్తే, తమ కుటుంబ సభ్యులనే పోటీకి నిలబెట్టే అవకాశముంది. అదే సూపర్ న్యూమరరీ తరహాలో అదనంగా పెంచితే, సాధారణ మహిళలకు కూడా అవకాశాలొచ్చి సహజ నాయకత్వం పెరిగే అవకాశముంది.

✦ డీలిమిటేషన్‌ను, మహిళా రిజర్వేషన్లను 2029 నుండి అమలు చేయటాన్ని ఒకే బిల్లులో కలపనక్కర్లేదన్న విమర్శను తోసిపుచ్చలేం. కానీ నష్టం కూడా లేదు. డీలిమిటేషన్ తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలవుతాయన్న 106వ రాజ్యాంగ సవరణకు 2023లో దాదాపు పూర్తి మద్దతిచ్చిన ప్రతిపక్షాలు..

ఇప్పుడు అందుకు విరుద్ధంగా పంతంతో వ్యవహరించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. బిల్లులో యూనియన్‌కి బదులు కేంద్రం అనే పదం వాడటం, రెండు పర్యాయాల తర్వాత రొటేషన్ అంటూ 15 ఏళ్ల కాలపరిమితి పేర్కొనటం వంటి లోపా లున్నా.. అవేం పెద్ద సమస్యలు కాదు. రొటేషన్ పద్ధతి వంటి లోపాల్ని క్రమంగా సవరించాలని లోక్‌సత్తా గతంలోనే ఎంపీలు, పార్టీల అధ్యక్షులు, పౌర సమాజ ప్రముఖులకు తెలియ చేసింది. బిల్లు ఆమోదం పొందితే, నిర్ణీత కాలవ్యవధితో కూడిన ఉపశమనమే కాబట్టి.. వాటిని సరిదిద్దుకోవచ్చు. కనీసం వాటిని గురించి కూడా విమర్శించకుండా, సెల్ఫ్‌గోల్ తరహాలో ఎంపీలు వ్యవహరించటం విస్మయం కలిగిస్తుంది.

✦ జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యపరంగా జరుగుతున్న అన్యాయం ఏమిటి, ఎలా కేటాయిస్తే న్యాయం జరుగుతుంది లేదా ఇంతకంటే మెరుగ్గా ఉంటుంది.. అని ప్రతిపక్షంలో ఏ ఒక్కరూ ప్రభుత్వానికి ప్రత్యామ్నా యంగా లోక్‌సభలో ప్రతిపాదించలేదు.

✦ రాజకీయ పార్టీలతో సంబంధంలేని కొందరు విశ్లేషకులు.. ఇప్పుడున్న సీట్లను పెంచకుండానే, దామాషా పద్ధతిలో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించి, ఒక్కో నియోజకవర్గంలో పురుషులతో పాటు రిజర్వేషన్ శాతం మేర మహిళా అభ్యర్థులు కూడా ఎన్నికయ్యే అవకాశం ఉండాలని సూచించారు. అంటే, ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ప్రతినిధులు. ఒక పురుషుడు, ఒక మహిళ. అదేవిధంగా, పెంచిన సీట్ల వరకూ దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలని మరికొందరు అభిప్రా యపడ్డారు.

✦ రాజ్యసభ సీట్లను పెంచి జనాభాపరంగా నష్టపోయిన రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని భర్తీ చేయాలని కొందరు పౌర సమాజ నిపుణులు సూచించారు. కానీ వీటినీ చర్చించలేదు.

✦ ప్రధాని మోదీ తన ఏకపక్ష, ప్రతిపక్షంతో ఢీకొట్టే ధోరణితో వ్యవసాయ చట్టాలను కూడా వెనక్కి తీసుకున్నారు. కొన్ని సమావేశాలు నిర్వహించి, చర్చలు జరిపి, నచ్చచెబితే రైతులు ఆమోదించేవారు. కానీ ఆయన తన మొండివైఖరినే కొన సాగించారు. ఇప్పుడు కూడా అదే తరహాలో.. 'చెప్పటం నా కర్తవ్యం, వినకపోతే మీ ఖర్మం' అనే రీతిలో వ్యవహ రించారు.

✦ దక్షిణాది రాష్ట్రాలకు నష్టం రాకుండా చూసే పూచీ నాది అని ప్రధాని మోదీ స్వయంగా చెప్పినా, అందుకు గణాంకసహిత ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా.. రాష్ట్రాల ప్రయోజనాల కంటే రాజకీయాలే చర్చలో పైచేయి సాధించటంతో, ప్రజాస్వామ్యం గురించే అంతంత మాత్రం అవగాహన ఉన్న కోట్లాది ప్రజలు.. ఎప్పుడో 1970ల తరంలో జరిగిన డీలిమిటేషన్ గురించి ఆ మాత్రం కూడా అవగాహనలేక మౌన ప్రేక్షకుల్లా మారారు.

✦ మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లులో బీసీలకు కోటా చేర్చకపోవటం పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగంలో లేనప్పుడు, ఇందులో చేర్చటం మరింత సంక్లిష్టమవుతుంది. అదేవిధంగా మతం ఆధారంగా ముస్లిం రిజర్వేషన్లూ సాధ్యం కాదు. నిబంధనలకు అనుగుణంగా ఎస్.సి, ఎస్.టిలకే వాటా కల్పించారు. అంతేగాక, బీసీలు ఎవరి అండా లేకుండా స్వయంగా ఎన్నిక కాగలుగుతున్నప్పుడు, మళ్లీ రిజర్వేషన్లు కల్పించటం సహజ నాయకత్వం ఎదిగే ప్రక్రియకు అవరోధం కల్పించటమవుతుంది. లాభం కంటే నష్టం ఎక్కువ జరుగుతుంది. ఇందులో ఏమీ రహస్యం లేదు. భేషజాలు లేకుండా చర్చించుకోవచ్చు.

✦ ప్రధాని చర్చలో స్వయంగా చెప్పినట్లు.. స్థానిక ప్రభుత్వాలకు పెద్ద ప్రాధాన్యత లేదు కాబట్టి, మగ మహారాజులు అక్కడ మహిళలకి అవకాశమిచ్చారు. అదే పార్లమెంటు, అసెంబ్లీ వద్దకొచ్చేసరికి, నియోజకవర్గం మీద పెత్తనం, రాజధాని పేషీల్లో పలుకుబడి ఉంటుంది కాబట్టి.. ప్రతిదీ పెద్ద సమస్యలా చూపు తూ అవరోధాలు సృష్టిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాల్లో నిధులు, అధికారాలు లేకపోవటం వల్ల మహిళలు తమ సామర్థ్యం మేరకు సత్తా చాటలేకపోతున్నారు. దీంతో, కుటుంబంలో పురుషులు వారి పేరు మీద ఎక్కువ పెత్తనం చేస్తున్నారు. ప్రధాని ఈ అం శాన్ని వేరే కోణంలో ఉదహరించినా, 'అసలైన భారత ప్రజా స్వామ్యం స్థానిక ప్రభుత్వాల్లోనే' ఉంది. ప్రజాస్వామ్యానికి పాఠ శాలలైన ఆ స్థానిక ప్రభుత్వాలు విఫలమవటం వల్లే, మనం ఇన్ని ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటున్నాం. సరైన నాయకత్వం కింది స్థాయి నుండి అవగాహనతో ఎదగటం లేదు.

✦ ఇప్పటి వరకు నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాట య్యాయి. ఇప్పుడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లులోనూ ఎటువంటి సందేహాలకూ ఆస్కారం లేదు.

✦ తమ రాష్ట్రానికి లాభమే అయినా, మహిళలే మహిళా రిజర్వేషన్ చట్టానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేశారు అంటే..పార్టీలు అంత అప్రజాస్వామికంగా, కేంద్రీకృతంగా తయారవటం కారణంగా చెప్పుకోవచ్చు. రాజ్యసభ సభ్యు రాలిగా ఉన్న ప్రియాంక చతుర్వేది మాత్రమే తన పార్టీ శివసేన వైఖరికి వ్యతిరేకంగా 131వ రాజ్యాంగ సవరణను సమర్థించారు.

✦కొన్నేళ్లలో జననాల రేటు అన్ని రాష్ట్రాల్లో స్థిరీకరణ సాధిస్తుంది. లోక్‌సభ భవనంలో సీట్ల సంఖ్య 888 మాత్రమే ఉన్నాయి కాబట్టి.. 850కి ఫ్రీజ్ చేసి భవిష్యత్తులో డీలిమిటేషన్‌ను వలసల జనాభా మాత్రమే ప్రభావితం చేయ గలిగేలా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపుల్లో మార్పులు చేయ వచ్చు. అప్పుడది సాధారణ ప్రక్రియ అవుతుంది. మన ప్రజా స్వామ్యం లోని మౌలిక లోపాల్ని సరిదిద్దుకోవటానికి, 131వ రాజ్యాంగ సవరణపై లోక్‌సభలో చర్చ, ఓటింగ్ ఫలితం ఒక అవకాశం.

❖

# కొన్ని లోపాలున్నా.. మహిళా రిజర్వేషన్ చట్టం 2029 నుండే అమలు మేలు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన 106వ రాజ్యాంగ సవరణ ఆమోదం (2023)లో భారత రాజకీయ వ్యవస్థ అరుదైన ఏకాభిప్రాయం కనబరిచింది. అన్ని రాజకీయ పార్టీలూ దాదాపు ముక్తకంఠంతో బిల్లుకి మద్దతిచ్చాయి. మానవ సమాజంలో సగభాగం మహిళలు. అయినా అతివలకు తొలి నుంచి ఓటు హక్కును అందించిన మొదటి రిపబ్లిక్ భారత్ మాత్రమే. పరిణతి చెందిన అనేక ప్రజాస్వామ్య దేశాల్లో సమాన పౌరులుగా గుర్తింపు పొందటానికి మహిళలు సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలు చేయాల్సి వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న గణతంత్ర ప్రజాస్వామ్యంలో మహిళలకి సమాన పాత్ర కల్పించటం విస్మరించొద్దని అమెరికా రెండవ అధ్యక్షుడు జాన్ ఆడమ్స్ సతీమణి అబిగెయిల్ ఆడమ్స్ తన భర్తతో వాదించారు. అయినా, 1787లో ఫిలడెల్ఫియాలో జరిగిన రాజ్యాంగ సదస్సు తెల్లజాతి పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఇచ్చింది. ఎప్పుడో 133 ఏళ్ల తర్వాత 1920లో మహిళలకు ఓటు హక్కు లభించింది. బ్రిటన్‌లో మరో ఎనిమిదేళ్లు పట్టింది.

మహిళల చదువుని, వివిధ వృత్తులు, వ్యాపారాలలో వారి పాత్రను కుటుంబాలు ఆమోదించటం ఇటీవలి దశాబ్దాల్లో పెరిగింది. ఇప్పుడు దాదాపు ఏ కాలేజీ, యూనివర్సిటీ చూసినా అబ్బాయిల కంటే అమ్మాయిలు మిన్నగా రాణిస్తు న్నారు. అయినా ప్రజాజీవితంలో మహిళల పాత్ర ఇప్పటికీ పరిమిత స్థాయిలోనే కొనసాగుతోంది. చట్టసభల్లో 1950 లలో 5% ఉన్న మహిళల సంఖ్య ఇప్పుడు 15% దాకా చేరింది. రాజకీయాలు ఇప్పటికీ పురుషుల అడ్డాగానే ఉన్నాయి.

చట్టసభల్లో మహిళలకు ఇంకా ఎంతో ఎక్కువ ప్రాతినిధ్యం అవసరమనటానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, సమాజంలో సగభాగానికి సగం గొంతు, ప్రాతినిధ్యం ఉండాలి. పురుషాధిక్య సాంప్రదాయం, శతాబ్దాల తరబడి మహిళల అణచివేత కొనసాగిన నేపథ్యంలో అధికార సభల్లో మహిళలకు మరింత గళం, పాత్ర ఉండటం న్యాయం, అవసరం. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా పట్టణీకరణ, పక్కవాళ్లెవరో కూడా తెలియని జీవనశైలి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మహిళల పట్ల హింస పెరుగుతోంది. ఇదే సమయంలో శ్రామిక శక్తిలో మహిళల పాత్ర ఇంకా తగ్గుతోంది. ఇప్పుడు 20% లోపే ఉంది. సంపదసృష్టిలో మహిళల పాత్రను కుదించేస్తే మెరుగైన వృద్ధి సాధించాలన్న మన కలలు నెరవేరవు. కాబట్టి మహిళలకు మరింత గొంతు, అధికారం ఇవ్వాలి.

రెండోది, మన ఫ్యూడల్ సమాజంలో, అంతరాల సంస్కృతిలో అధికారమంటే పెత్తనం చెలాయించటం, ఇతరులను నియంత్రించటం. అందువల్లే ప్రభుత్వంలో పదవి అంటే హోం (పోలీసు), రక్షణ (సైన్యం), ఆర్థిక, పన్నులు (డబ్బు), రెవెన్యూ (భూమి) వంటి శాఖలనే ఎక్కువమంది కోరుకుంటుంటారు. ఆధిపత్య భావజాలంలో కూరుకుపోవటం వల్లే ఆరోగ్యం, విద్య, కనీస సౌకర్యాలు, నైపుణ్యాలు, ఉపాధి కల్పన మొదలైన శాఖలను చిన్న చూపు చూస్తారు. మహిళల ప్రాతినిధ్యం పెరిగితే పెత్తందారీ రాజకీయాన్ని పునర్నిర్వచించగలరు. రాజకీయమంటే సేవ తప్ప నియంత్రణ, ఆధిపత్యం కాదని నిరూపిస్తారు. ఓటర్లు, పన్ను చెల్లింపుదారులకు రోజువారీ జీవితంలో నిజంగా ఎంతో ముఖ్యమైన అంశాల మీద దృష్టి సారిస్తారు. మనం అధికార రాజకీయాల పట్ల ఆకర్షణను తొలగించాలి,

ప్రజలకు సేవలు అందించటం, జవాబుదారీతనం, అధికార వికేంద్రీకరణలను ప్రోత్సహించాలి.

తమ ఆకాంక్షల్ని, ప్రతిభాపాటవాల్ని పురుషుల ఎదుగుదల కోసం అణచివేసుకుంటూ ఒత్తిడితో సతమతమవుతున్న మహిళలు కుటుంబాల్లో, సమాజంలో మనకు నిత్యం కనిపిస్తుంటారు. అయితే ఇదే సమాజంలో, ఓటర్లు మహిళా నేతల పట్ల ఎటువంటి వ్యతిరేక భావాన్ని ప్రదర్శించరంటే అతిశయోక్తి కాదు.

1952 నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులను చూస్తే, నిజానికి పురుషుల కన్నా మహిళలే ఎక్కువశాతం ఎన్నికయ్యారు. గుర్తింపు పొందిన పార్టీల నుంచి 25% పురుష అభ్యర్థులు ఎన్నిక కాగా, మహిళల్లో ఆ సంఖ్య 33% దాకా ఉంది. అందుకే గత కొన్ని దశాబ్దాలలో మనకు పలువురు నిజమైన మహిళా నాయకులు కనిపిస్తారు; ఇందిరాగాంధీ, నందిని శత్పథి, జయలలిత, మాయావతి, వసుంధర రాజె, మమతా బెనర్జీ మొదలైనవారు ఓటర్ల నుంచి ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఉన్నత స్థానాలకు ఎదిగారు.

**సమస్య ఓటర్లలో లేదు**

మహిళా ప్రాతినిధ్యానికి సంబంధించి సమస్య ఓటర్లలో లేదు; మహిళా నాయకత్వాన్ని పెంచటంలో పార్టీల వైఫల్యంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత మహిళా చట్టంలో ఉన్నట్లు.. ప్రతి ఎన్నికకు లేదా రెండు ఎన్నికలకోసారి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ ఏర్పాటు చేయటం వల్ల కీలుబొమ్మ మహిళా నాయకులు తయారవుతారు. తమ అధికారాన్ని కోల్పోవటాన్ని శాయశక్తులా వ్యతిరేకించే బలమైన పురుష నాయకులు తమ బదులుగా తమ కుటుంబంలోని మహిళా సభ్యులను నామినేట్ చేసి నిజమైన అధికారాన్ని మాత్రం తామే చెలాయిస్తారు. మహిళా సర్పంచ్ లేదా మునిసిపల్ నాయకురాలి భర్త నిజమైన అధికారాన్ని చెలాయించే 'పంచ్‌పతుల' సంస్కృతిని ఇప్పటికే చాలా స్థానిక ప్రభుత్వాల్లో చూస్తున్నాం. తమను తాము నిజమైన నాయకులుగా నిరూపించుకున్న మహిళా ప్రతినిధులకు రొటేషన్ విధానం వల్ల మరోసారి పోటీ చేసే అవకాశం లభించదు. దీంతో వారు చివరికి ప్రజాజీవితం నుంచి కనుమరుగవుతారు. రిజర్వేషన్ రొటేషన్ వల్ల తిరిగి ఎన్నికయ్యే అవకాశం లేకపోవటంతో ప్రతినిధుల్లోని మానవ సహజ స్వార్థాలను నియంత్రించి వారిని సమాజహితం వైపు నడిపించే ప్రోత్సాహకాలు కరువవుతాయి. దోపిడీ, అవినీతి రాజకీయాలకు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుంది.

పార్టీలే ఇచ్చేలా చట్టం వల్ల సహజ నాయకత్వం

నాయకత్వం అభివృద్ధికి దశాబ్దాల కృషి అవసరం. ఇందుకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ కన్నా, పార్టీలే ఆ రకంగా రిజర్వేషన్‌కి తగ్గ సంఖ్యలో సీట్లిచ్చేలా చట్టబద్ధ ఏర్పాటు చేయటం మేలు. ఈ రకమైన పార్టీ కోటా పద్ధతిలో ఏ సీట్లను మహిళలకు కేటాయించాలి అన్న అంశంపై పార్టీలకు కూడా కొంత స్వేచ్ఛ ఉంటుంది. దీనివల్ల పురుషులకు డమ్మీలుగా ఉండే నాయకత్వం కాకుండా, సహజ నాయకత్వం మహిళల నుంచి పెరుగుతుంది. విజయవంతమైన మహిళా నేతలు తర్వాతి ఎన్నికల్లో ఆత్మవిశ్వాసంతో పోటీ చేయగలుగుతారు, కాలక్రమంలో తమ స్థాయిని పెంచుకోగలుగుతారు. ఇదే సమయంలో పార్టీలు తమకున్న స్వేచ్ఛను దుర్వినియోగం చేసి, తమకు బలం లేని స్థానాల్లో మహిళల్ని నిలబెట్టే అవకాశం లేకుండా చట్టబద్ధంగా తగిన రక్షణల్ని ఏర్పాటు చేయవచ్చు. లోక్‌సభ సీట్లకయితే రాష్ట్రం యూనిట్‌గా, రాష్ట్ర అసెంబ్లీ అయితే మూడు లోక్‌సభ స్థానాలు యూనిట్‌గా పార్టీలు సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. అంటే, ఏ పార్టీ అయినా తాను మహిళలకు కేటాయించాల్సిన సీట్లను తనకు బలం లేని రాష్ట్రంలో కేటాయించే అవకాశం ఉండదు. ప్రతి రాష్ట్రంలో విధిగా లోక్‌సభకు మహిళలకు 33% సీట్లు కేటాయించాలి. రాష్ట్రం యూనిట్. అలాగే రాష్ట్రం లోపల, తనకు బలం లేని సీట్లను మహిళల కోటా కింద ఇవ్వటం కుదరదు. ప్రతి మూడు లోక్‌సభ స్థానాల యూనిట్ నుంచి మూడో వంతు అసెంబ్లీ సీట్ల చొప్పున అన్ని లోక్‌సభ స్థానాల నుంచి మహిళలకు 33% సీట్లు కేటాయించాలి.

ప్రస్తుత మహిళా రిజర్వేషన్ చట్టం రూపకల్పన లోపభూయిష్టంగా ఉన్నప్పటికీ, ఏదోకరూపంలో మహిళల ప్రాతినిధ్యం పెంచటానికి చేసిన ప్రయత్నంగా మనం స్వాగతించాలి; మెరుగైన పద్ధతిలో చట్టం రూపొందిస్తే రాజకీయాల స్వభావంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుంది.

మహిళా రిజర్వేషన్లను వేగంగా, మగమహారాజుల అభ్యంతరానికి అవకాశం లేకుండా అమలుకి మన శాసనకర్తలు లోక్‌సభ సీట్లను పెంచటం, 2029 ఎన్నికల్లోనే అమలు చేయటం తదితర మార్పులతో ప్రతిపాదించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్, 2026లో పార్లమెంటులో వీగిపోవటం దురదృష్టకరం. జనాభాతో నిమిత్తం లేకుండా ప్రస్తుతం రాష్ట్రాలవారీగా ఉన్న సీట్ల నిష్పత్తిని కొనసాగించే సువర్ణావకాశాన్ని, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, ముందుచూపు కొరవడిన రాజకీయంతో జారవిడుచుకున్నాయి. ఎంత త్వరగా వీలుంటే, అంతత్వరగా మహిళలకు రాజకీయ సాధికారత కల్పించాలి. దానివల్ల అద్భుతాలు జరగకున్నా.. సంస్కరణలు మానవీయ, సమ్మిళిత కోణంలో వేగంగా అమలవుతాయి. పార్టీల్ని ప్రజాస్వామీకరించటం ద్వారా మహిళా రిజర్వేషన్ చట్టంలో రాజకీయాల్ని మెరుగు పరిచే దిద్దుబాట్లకి కూడా వీలైనంత త్వరితగతిన చొరవ తీసుకోవాలి.

❖

# ఓపీఎస్ ఊబిలో హిమాచల్ ప్రదేశ్..ప్రభుత్వోద్యోగుల జీతాలు కట్,

# ఏపీ, తెలంగాణలకూ ఆర్థిక డేంజర్

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

భారతీయ మీడియా, మధ్యతరగతిలో అత్యధికులు రాజకీయాల్ని ప్రేక్షకుల ఆటగా, అధికార క్రీడగా భావిస్తూ మమేకమవుతుంటారు. కానీ మన సమాజ భవిష్యత్తు బహుశా దేశ ఆర్థిక నిర్వహణపై ఆధారపడి ఉంటుంది.

ప్రభుత్వాలు నిర్లక్ష్యపూరితంగా ఈవేళ ఎటువంటి కేటాయింపులు చేయకుండా, మితిమీరిన ఔదార్యంతో ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేస్తే భవిష్యత్తు తరాలకు ఎంతటి ప్రమాదం ఎదురవుతుందో ఇప్పటికే చాలాసార్లు ప్రజలకు తెలియచెప్పా. భవిష్యత్తులో చెల్లించే పెన్షన్‌కి ఇప్పుడే డబ్బులు మదుపు చేసే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్/సీపీఎస్)ను 2004లో తీసుకురాగా.. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞత, ముందుచూపు లేకుండా ఓపీఎస్‌కి మళ్లాయి.

కానీ ఇప్పుడు ఈ సరళి తిరోగమిస్తున్నట్లు కనిపించటం సంతోషకరం. ఇప్పుడే నిధులు సమకూర్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్, ఉద్యోగులకు కనీస పెన్షన్‌కు గ్యారంటీనిస్తూ, అదే సమయంలో వచ్చే తరంపై భారం లేకుండా రూపొందించిన పెన్షన్ పద్ధతి క్రమంగా ఆమోదం పొందుతోంది. అటువంటి గ్యారంటీడ్ పెన్షన్ విధానాన్ని (జీపీఎస్) ఆంధ్రప్రదేశ్ ప్రవేశపెట్టింది. ఓపీఎస్ తెస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన కర్ణాటక, తెలంగాణ ఆ అంశాన్ని పక్కన పెట్టాయి. ఇది సరైన పంథా. ఆ పార్టీ అక్కడ ప్రత్యామ్నాయాలను వెతుకుతోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావటంతో వినాశకర ఓపీఎస్ విధానాన్ని ప్రభుత్వాలు వెనక్కి మళ్లిస్తున్నాయి. నిధులు ఇప్పుడే జమ చేస్తూ కనీస పెన్షన్‌కి గ్యారంటీ ఇచ్చే కాంట్రిబ్యూటరీ యూనివర్సల్ పెన్షన్ విధానాన్ని (యూపీఎస్) యూనియన్ ప్రభుత్వం ఆమోదించింది. మహారాష్ట్ర ఇప్పుడు యూపీఎస్ అమలు చేస్తోంది. మొత్తంగా, ఈవేళ ఎటువంటి నిధులూ సమకూర్చని ఓపీఎస్‌కు హామీ ఇచ్చే ప్రమాదకర సరళి నుండి.. గ్యారంటీ పెన్షన్ కోసం ఉద్యోగుల ఆందోళనల్ని పరిగణలోకి తీసుకునే విధానానికి మళ్లటం ఆహ్వానించదగ్గ, విజ్ఞతతో కూడిన పరిణామం.

ఓపీఎస్‌తో.. ఈవేళ్టి పిల్లలు, యువత భవిష్యత్తు నాశనమై ఉండేది. భారతదేశం కనీవినీ ఎరుగని ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొని ఉండేది. ఇప్పుడు కూడా పెన్షన్ భారం వేగంగా పెరుగుతోంది, ప్రభుత్వాలు ఆదాయాల నుంచి విధిగా చేయాల్సిన ఖర్చులను తప్పించుకోలేకపోతున్నాయి. 2004 తర్వాత నియామకం పొందిన ఉద్యోగులు రిటైరవటం మరో దశాబ్దం తర్వాత మొదలవుతుంది. వారు ప్రభుత్వ ఖజానా నుండి కాకుండా పెన్షన్ నిధి నుండి పింఛను తీసుకోవటం అప్పటి నుంచి మొదలవుతుంది. కానీ 2004కి ముందు నియమితులైన ఉద్యోగులు ఓపీఎస్ కింద ప్రభుత్వ ఖజానా నుండి భారీ పెన్షన్లను తీసుకుంటుంటారు. గత తరంవారికి అందించిన సేవలకు చెల్లించాల్సిన భారం భవిష్యత్తు పన్ను చెల్లింపుదారుపై ఉంటుంది.

2004కి ముందు నియామకం పొందినవారు ఓపీఎస్ కింద పెన్షన్లు తీసుకోవటం మరో నాలుగైదు దశాబ్దాలపాటు కొనసాగుతుంది. కానీ ఎన్‌పీఎస్/జీపీఎస్‌తో ఖజానాపై పెన్షన్ భారం సుమారు 2035 నుండి తగ్గటం మొదలవుతుంది. అలా తగ్గుతూ 2070 ప్రాంతం నాటికి పూర్తిగా ఆగిపోతుంది. మనం విజ్ఞత లేకుండా భారాన్ని భవిష్యత్తుపైకి నెడితే, మన పిల్లలు భారీ మూల్యం చెల్లిస్తారు. కానీ ఇప్పటికైనా కారుచీకట్లో కాంతిరేఖ కనిపిస్తోంది.

దేశం మొత్తంలో ఇప్పటికీ వినాశకరమైన పాత పెన్షన్ పద్ధతిని కొనసాగిస్తున్న ఏకైక రాష్ట్రం పశ్చిమ బెంగాల్. పశ్చిమ బెంగాల్ వచ్చే దశాబ్దాలలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోబోతోంది. ఓపీఎస్‌ను అమలు చేస్తూ ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలమైనందున హిమాచల్ ప్రదేశ్ ఆరునెలల పాటు ఉన్నతాధికారుల జీతాల్లో 30% వరకు కోత విధించింది. ప్రత్యేక హోదా ప్రయోజనాలున్నా.. ఓటుబ్యాంకు పందేరాల వల్ల ఆర్థిక భారాన్ని తట్టుకోలేక పోతోంది. రాజ్యాంగంలోని 309 అధికరణాన్ని అనుసరించి రాష్ట్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక పరిస్థితి

మెరుగుపడ్డాక వీలునుబట్టి ఆ కోత డబ్బుని తిరిగి చెల్లిస్తామని ప్రకటన చేసింది. ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు.. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందే కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీల్లో కూడా ఉన్నతస్థాయి ఉద్యోగులకూ ఈ తగ్గింపు వర్తిస్తుంది. నిధులను జమ చేసే, కాంట్రిబ్యూటరీ పెన్షన్ పద్ధతిని హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ కనీసం ఇప్పటికైనా ప్రవేశపెడతాయని ఆశిద్దాం. మిగిలిన అన్ని రాష్ట్రాలూ అవసరమైతే యూపీఎస్‌కి అనుగుణంగా కొన్ని మార్పులతో మెరుగుపరచుకుని ఎన్‌పీఎస్‌ని గనక కొనసాగిస్తే వివేకాన్ని ప్రదర్శించినట్లు. తెలంగాణ రాష్ట్రం ఓపీఎస్ హామీ గురించి మౌనం వహించినా, విపరీత సంక్షేమ పథకాల వల్ల ఆర్థికంగా తీవ్ర కటకట నెదుర్కొంటోంది. విశ్రాంత ఉద్యోగులకు ఎప్పటినుండో పెండింగ్‌లో ఉన్న సుమారు 8,000 కోట్ల బకాయిలు చెల్లించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధుల వేతనాల్లో 50% నిలిపివేయాలని తెలంగాణ మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. ఇందుకోసం కొందరు మంత్రులతో 'రెవెన్యూ రిసోర్సెస్ మొబిలైజేషన్ కమిటీ'ని ప్రభుత్వం నియమించింది. కానీ అదో సంకేతమే తప్ప.. బకాయిలు తీర్చటానికి సరిపోదు. అప్పుల వాళ్ల తాకిడిని తట్టుకోలేక ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని, వచ్చే రెండు నెలల్లో రూ.12,000 కోట్ల వరకూ రుణాలు సమీకరించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోందని మీడియాలో వార్తలు వచ్చాయి. బడ్జెట్‌లో ప్రకటించిన వివరాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం వివిధ రూపాలలో రు.2,10,000 కోట్ల వరకు బకాయిలు వివిధ వర్గాలకు చెల్లించాల్సి ఉంది.

భవిష్యత్తుకి ఒక ప్రమాదం తొలగిపోగా, చాలా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ప్రభుత్వ ఆదాయాల నిర్వహణను మెరుగుపరిచేందుకు యూనియన్ ప్రభుత్వం సమర్థంగా వ్యవహరిస్తోంది. అప్పుల భారాన్ని, ద్రవ్య లోటుల్ని తగ్గించటంలో ఒక ఆచరణసాధ్య రోడ్‌మ్యాప్‌ని అనుసరిస్తోంది. ఆర్థిక క్రమశిక్షణకు కొన్ని రాష్ట్రాలకి నమూనాలున్నాయి. ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలు ఆరోగ్యకరకమైన ఆదాయాల మిగులును చూపుతున్నాయి. ఫలితంగా, వాటి మూలధన పెట్టుబడి అప్పుల కంటే ఎక్కువగా ఉంది. తద్వారా వేగంగా అభివృద్ధికి, భవిష్యత్తు ప్రగతికి మార్గం వేస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు సాపేక్షంగా బలమైన ఆర్థిక వ్యవస్థలు కలిగి ఉన్నాయి. అభివృద్ధి చోదక శక్తులుగా మహానగరాలు ఉండటం, పట్టణీకరణ అధికంగా ఉండటం అనుకూలతల వల్ల లబ్ధి పొందుతున్నాయి. ఫలితంగా, నిధుల్ని దుబారా చేస్తున్నా, తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమంపై మితిమీరి దృష్టి పెట్టినా, తమ ఆర్థిక వ్యవస్థల బలం వల్ల సంక్షోభం నుండి తప్పించుకుంటున్నాయి. ఈ రాష్ట్రాల ప్రగతి రాబోయే కాలంలో కొంత కుంటుబడే ప్రమాదం ఉంది, కానీ మరీ విశృంఖలంగా ప్రభుత్వ వనరుల్ని దుర్వినియోగం చేస్తే తప్ప అప్పుల ఊబిలో కూరుకుపోవటం లేదా ఆర్థికంగా కుప్పకూలటం ఉండదు.

ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణ ఎంత ఆరోగ్యకరంగా ఉందనేది మనం మూడు సులభమైన పద్ధతుల్లో అంచనా వేయగలం. మొదటిది, జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఆదాయాల నుండి ఎంత వాటా ఖర్చు చేస్తున్నారు? ఎటువంటి విచక్షణాధికారానికి అవకాశం లేకుండా, విధిగా చెల్లించాల్సిన ఖర్చుకి చాలా ఎక్కువ వాటా వెళ్తుంటే, ప్రభుత్వం పాలనాపరంగా చేయాల్సిన పనులకు చాలా తక్కువ మిగులుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న తాత్కాలిక సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం పెరుగుతున్న దృష్ట్యా, రోజువారీ వ్యయంపై చాలా ఎక్కువ అప్పు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మౌలికంగా చేయాల్సిన పనులు, భవిష్యత్తు అభివృద్ధికి మూలధన పెట్టుబడి దెబ్బతింటాయి. రాష్ట్రం ఆర్థిక సంక్షోభం, పేదరికం, వెనుకబాటుతనంలోకి మళ్లుతుంది. రెండోది, మనం మొత్తం ప్రభుత్వ అప్పు రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎంత శాతం ఉందో చూడాలి. ఈ లెక్క రాష్ట్రాలకు 20% ఉండాలి. కానీ చాలా రాష్ట్రాలు 40% దాటిపోయాయి. కొన్ని రాష్ట్రాలు 50-60% స్థాయిలో ఉన్నాయి. తక్షణ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మూడోది, రెవెన్యూ ఆదాయాల్లో అప్పులు చెల్లించటానికి వెచ్చించే వాటా పరపతి సామర్థ్యాన్ని తెలియచేస్తుంది. ఒక రాష్ట్రం అప్పుల ఊబికి ఎంత చేరువలో ఉందో మనకి ఓ అంచనానిస్తుంది.

ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, కేరళ, పశ్చిమ బెంగాల్ ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్నాయి, లేదా ప్రమాదకరంగా ఆ దరిదాపుల్లో ఉన్నాయి. భారతదేశ ఆర్థిక స్థిరత్వానికి, పరపతి విలువకు యూనియన్ ప్రభుత్వానిదే బాధ్యత. యూనియన్, రాష్ట్రాలు రెండూ కలిసి ఒకటే ఆర్థిక వ్యవస్థ అవుతాయి. రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ మార్గాన్ని అనుసరించేలా చేయాల్సిన బాధ్యత జాతీయ స్థాయి ప్రభుత్వంపై ఉంది. కానీ మన ఆర్థిక వ్యవస్థ భవిస్యత్తుని పరిరక్షించటానికి మొదట మనం ద్రవ్యలోటును తగ్గించాలి, పునర్వ్యవస్థీకరించాలి. వచ్చే రెండు మూడు దశాబ్దాలలో వేగంగా ఎదిగే అమూల్యమైన అవకాశం భారత్‌కి ఉంది. ఆ అవకాశాన్ని అందుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణ ఆరోగ్యకరంగా ఉండటం భవిష్యత్తు ప్రగతికి కీలకం. ❖

# రుణమాఫీలు, ఉచిత విద్యుత్తా?..నిజమైన సంక్షేమమా? రాష్ట్రాలు తేల్చుకోవాలి

ఎన్ని లోపాలు, నిర్లక్ష్యాలున్నా.. ఆర్థికంగా వేగంగా ఎదిగేందుకు భారత దేశానికి మరో అవకాశం లభించిన తరుణమిది. ఈ వృద్ధికి అంతర్జాతీయ ఉద్రిక్తతల అవరోధాల గురించే ఆందోళన చెందుతుంటే, దేశీయంగా ఆర్థిక సవాళు అంతకంటే ఎక్కువ సమస్యగా మారాయి. రాష్ట్రాల సమాహారమైన ఫెడరల్ భారతం.. ఆ రాష్ట్రాల బాధ్యతా రాహిత్యం వల్ల ఇంకా ఎక్కువ నష్టపోతోంది. 'సంక్షేమం అవసరం. కానీ ఆ సంక్షేమం ప్రజల సామర్థ్యాన్ని పెంచకుండా వారికి, దేశానికి నష్టం కలిగించేలా ఉంటే.. అది చాలా ప్రమాదకరం. వచ్చే ఎన్నిక గురించి తప్ప, వచ్చే తరం గురించి ఏమాత్రం ఆలోచన లేకుండా సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాల పథకాల్ని రాష్ట్రాల్లో పార్టీలు పోటాపోటీగా ప్రకటిస్తున్నాయి' అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ప్రజాస్వామ్య సంస్కరణల కోసం దశాబ్దాల కృషిలో భాగంగా తాను ఎంతో సమయం వెచ్చించిన వ్యవసాయ రంగం, రైతులకు సంక్షేమం పేరుతో జరుగుతున్న భారీ నష్టాన్ని పరిష్కారాలతో వివరించారు. రుణమాఫీలు, ఉచిత విద్యుత్తు రైతుల్ని, రాష్ట్రాలను, చివరికి దేశ ఆర్థిక వ్యవస్థని ఎలా నాశనం చేస్తున్నాయో తెలియచెప్పారు. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలన్నారు. **ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధ పర్యవసానాల నేపథ్యంలో ఓ ఆంగ్ల పత్రిక హైదరాబాద్ ప్రతినిధి వీఆర్‌సీ ఫణిహరన్‌కి జేపీ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు:**



**(?) *రైతు రుణమాఫీలు ఎక్కడ చేసినా సత్ఫలితాలనివ్వలేదు. ఏ రకంగా చూసినా, అవి ప్రజాధనం వృధా పథకాలయ్యాయి. రైతుల జీవితాలూ బాగుపడలేదు. ఇన్నిసార్లు విఫలమైనా, మళ్లీ మళ్లీ భారత రాజకీయాల్లో రైతు రుణమాఫీ ఎందుకు ఎజెండా అవుతోంది***

**జేపీ:** రుణమాఫీలు మన ఎన్నికల వ్యవస్థలో రాజకీయ అనివార్యతగా మారాయి. ఏ పార్టీ అయినా ఆ హామీలు ఇవ్వకపోతే, ఎన్నికల్లో ఓడిపోతామేమోనని భయం. హామీ ఇచ్చి, అమలులో విఫలమైనా.. మళ్లీ ఓటమి ప్రమాదం పొంచి ఉంటుంది. మాట తప్పకుండా అణాపైసలతో సహా అమలు చేసినా.. నాయకులు గెలుస్తారని గ్యారంటీ లేదు. చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖరరావు మాఫీ స్కీముల ప్రయత్నం చేశారు. అందరూ ఎదురుదెబ్బలు తిన్నారు. కాబట్టి, రాజకీయ నాయకులు ఒక విషవలయంలో చిక్కుకున్నారు. ఇది రైతులకు మేలు చేయటం కాదు; ఎన్నికల్లో పార్టీలు బతికిబట్టకట్టటం కోసం తెంపరితనంతో చేస్తున్న ప్రయత్నం.

**(?) *ఈ మాఫీల కల్చర్ ఎప్పటి నుంచి మొదలైంది. మొదట్లోనైనా సానుకూల ఫలితాలొచ్చాయా***

**జేపీ:** భారత్‌లో రైతులకి మొదటి పెద్ద రుణమాఫీ 1989-90లో జరిగింది. వీపీ సింగ్ ప్రభుత్వంలో చౌధురి దేవీలాల్ అమలు చేశారు. ఆ సమయంలో, దేశమంతా కలిపి రుణమాఫీకి సుమారు రూ.12-15,000 కోట్లు ఖర్చయింది. అప్పుడు నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్‌కి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నాను. ఆ మాఫీ పరిణామాల్ని ప్రత్యక్షంగా చూశాను. బ్యాంకుల్లో తీసుకున్న

రుణాల్ని ఎగవేశారు. కేవలం 8% రుణాలు తిరిగి చెల్లించారు. వందకి రూ.92 ఎగవేస్తే, ఇక పరపతి వ్యవస్థ ఏముంటుంది? ధ్వంసమైంది. బ్యాంకులు అస్తిత్వ సంక్షోభంలో కూరుకుపోయాయి. రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే సంస్కృతి ఒక్కసారి విచ్ఛిన్నమైతే, మొత్తం వ్యవస్థే కుప్పకూలుతుంది.

**(?) రుణమాఫీలు రైతుల పాలిట 'వినాశకరం' అని మీరు పదే పదే ఎందుకు హెచ్చరిస్తున్నారు**

ఎందుకంటే.. 'అప్పు ఉచితం కాదు, తిరిగి చెల్లించాలి' అనే క్రమశిక్షణకు అవి గండి కొడుతున్నాయి. రుణమాఫీలు రాజకీయ ఎజెండాగా మారితే.. ఇక తాము రుణాల్ని తిరిగి చెల్లించనక్కర్లేదు, ప్రభుత్వం వాటిని నిరంతరం మాఫీ చేస్తుంటుంది అని రైతులు ఆశిస్తుంటారు. దీనివల్ల అప్పు పుట్టే అవకాశాలు ఆవిరవుతాయి. కేవలం భూస్వాములు, బాగా స్థిరపడిన రైతులకు మాత్రమే రుణాలు దొరుకుతాయి. చిన్న రైతులకి రుణసదుపాయం కరువవుతుంది. రైతులకు నిజంగా కావలసినది, సకాలంలో, సహేతుక వడ్డీ రేట్లతో, అవసరమైన మొత్తంలో రుణం తప్ప.. రుణమాఫీ కాదు. రుణమాఫీల సంస్కృతికి ముందు ప్రభుత్వాలు వడ్డీ తగ్గింపు పథకాలను అమలు చేసేవి. సకాలంలో రుణాల్ని చెల్లించిన రైతులకు మూడు శాతం మినహాయింపు ఇవ్వటం వల్ల వడ్డీ రేట్లు 6–7 శాతానికి తగ్గేవి. రైతులకు భారం ఉండేది కాదు. అదీ సబ్సిడీయే. కానీ, అది ఆరోగ్యకరమైన ప్రోత్సాహకం. అందుకు విరుద్ధంగా రుణమాఫీల్ని తీసుకొచ్చారు. రైతుకి నష్టం చేసే బాధ్యతారహిత సంస్కృతిని వ్యాపింపచేశారు.

**(?) పరిశ్రమలకు రుణమాఫీల్ని అమలు చేయటం లేదా? అని కొందరు వాదిస్తుంటారు. రైతు రుణమాఫీలు, పరిశ్రమల రుణమాఫీలు ఒకటే కాదా**

కాదు. పరిశ్రమల రుణమాఫీ చాలా భిన్నమైనది. పారిశ్రామిక రంగంలో పెట్టుబడి నష్టం వరకు కొన్ని సందర్భాల్లో భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. మార్కెట్ స్పందనని నూరుశాతం కచ్చితంగా అంచనా వేయటం అన్నివేళలా సాధ్యంకాక పోవచ్చు. కొన్ని మోసంలేని, నిజ మైన ప్రమాదాలు, నష్టాలు ఎదురవుతాయి. అలాంటప్పుడు తాకట్టు ఆస్తుల వరకు బ్యాంకులు స్వాధీనం చేసుకుంటాయి. అకౌంట్లను హేతుబద్ధంగా సర్దుబాటు చేస్తాయి. అదేమీ గంపగుత్త రుణమాఫీ కాదు. కానీ వ్యవసాయంలో మాఫీలు మొత్తంగా రాజకీయ నిర్ణయాలు. మార్కెట్‌తో సంబంధం లేనివి. అవి ప్రోత్సాహకాల్ని నాశనం చేస్తాయి. మొత్తం పరపతి వ్యవస్థను విచ్ఛిన్నం గావిస్తాయి. రెంటినీ పోల్చటం నిజాలపై మభ్యపెట్టటం.

**(?) దీర్ఘకాలిక పర్యవసానాలేమిటి**



**పరిశ్రమల గంపగుత్త రుణమాఫీ కాదు. కానీ వ్యవసాయంలో మాఫీలు మొత్తంగా రాజకీయ నిర్ణయాలు. మార్కెట్‌తో సంబంధం లేనివి. అవి ప్రోత్సాహకాల్ని నాశనం చేస్తాయి. మొత్తం పరపతి వ్యవస్థను విచ్ఛిన్నం గావిస్తాయి. రెంటినీ పోల్చటం నిజాలపై మభ్యపెట్టటం.**

రుణమాఫీలు వ్యవసాయాన్ని ఎదుగూబొదుగూ లేకుండా చేస్తాయి. రైతులు నిరంతరం చేయిజాచి అర్థించేవారుగా, ఆధారపడేవారుగా కొనసాగుతారు. పెట్టుబడులు కరువవుతాయి. వ్యవసాయ రంగం స్వయంసమృద్ధిని సాధించలేదు. తెలంగాణనే తీసుకోండి. భారతదేశంలోనే సంపన్న రాష్ట్రంగా ప్రారంభమైంది. కానీ ఈవేళ ప్రభుత్వోద్యోగుల జీతాలు, పెన్షన్లు చెల్లించటానికి అష్టకష్టాలు పడుతోంది. మితిమీరిన సంక్షేమం, మాఫీలు రాష్ట్రాన్ని అప్పుల ఉచ్చులోకి నెట్టాయి. చివరికి, దీనివల్ల వ్యవస్థ అల్లకల్లోలమవుతుంది. ఈవేళ, తెలంగాణ పెండింగ్ బిల్లుల బకాయిలే రూ.2.1 లక్షల కోట్లపైన ఉన్నాయి. చిన్న కాంట్రాక్టర్లు, సరఫరా వ్యాపారులు బిల్లుల చెల్లింపు కోసం ఎదురుచూస్తున్నారు. ఎందుకీ సిగ్గుచేటు పరిస్థితి ఏర్పడింది?.. ఇష్టమొచ్చినట్లు జీతాలు పెంచటం, జనాకర్షక పథకాలను అమలు చేయటం వల్ల ఏర్పడింది.

**(?) సంక్షేమ పథకాల కాన్సెప్ట్‌కే మీరు వ్యతిరేకమా**

కానే కాదు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం అవసరం. కానీ అది ఆచరణసాధ్యంగా ఉండాలి. ప్రజల శక్తిసామర్థ్యాలను పెంచే విధంగా ఉండాలి. రోజువారీ సబ్సిడీలు ఇవ్వటానికి కూడా అప్పులు తేవటం వల్ల భావితరాల మీద మోయలేని అన్యాయమైన భారం పడుతుంది. రైతులకు చేసే ఏ సహాయమైనా వారికి సాధికారత కలిగించేదిగా ఉండాలి. ఉదాహరణకు, ప్రత్యక్ష నగదు బదిలీలు లేదా కూరగాయలు, పండ్ల తోటలు, చేపలు, ఇంధన పంటలు వంటి

వ్యవసాయాధారిత పరిశ్రమలకు మద్దతు సహాయం అందించవచ్చు. కానీ ఉచిత విద్యుత్ వంటి సబ్సిడీలు, మితిమీరిన యూరియా వినియోగం ఆర్థిక వ్యవస్థ సమతూకాన్ని దెబ్బతీస్తాయి. ఉత్పాదకతకు హానిచేస్తాయి. ఉదాహరణకు, ఉచిత విద్యుత్తు వృథాకి ప్రోత్సాహకంగా మారుతుంది. భూగర్భ జలాలను ఖాళీ చేస్తుంది. రైతుల సామర్థ్యాన్ని పెంచే ప్రోత్సాహకాల్ని తొలగిస్తుంది. యూరియా రాయితీలూ అంతే. మితిమీరిన వినియోగానికి కారణమవుతాయి. భూసారాన్ని, సమతౌల్యాన్ని దెబ్బతీస్తాయి. సంక్షేమ చర్యలు, పథకాలు ఎలా, ఎక్కడ గతి తప్పాయో తెలియచెప్పే కొన్ని ఉదాహరణలివి.

**(?) అప్పుల్ని తిరిగి చెల్లించే రైతుల సంగతేమిటి**

న్యాయంగా అప్పు చెల్లించిన పిచ్చోళ్లారా.. అని వారిని ఎద్దేవా చేయటం. అప్పు ఎగ్గొట్టినవారికి బహుమతి.. నిజాయితీగా చెల్లించినవారికేమో శిక్ష. ఇదేం పాలన?.. ఇలాంటి పాలన ప్రజల ఆలోచనాతీరుపై దుష్ప్రభావం కనబరుస్తుంది. రుణమాఫీ అర్హత కోసం బకాయిలు తిరిగి చెల్లించటంలో కూడా దొంగ లెక్కలు చూపుతారు. దీనివల్ల, వ్యవస్థలోని క్రమశిక్షణ ఇంకా హరించుకుపోతుంది. ప్రభుత్వాలు రూ. రెండు లక్షల మేర రుణమాఫీల్ని ప్రకటించినప్పుడు.. అర్హత సంపాదించటానికి అవసరమైన వడ్డీ మాత్రమే చెల్లించటానికి రైతులు బారులు తీరుతుంటారు. ఇది ఎంతమాత్రం ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థ కాదు, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు.

**(?) మాఫీల్లో కౌలు రైతుల మాటేమిటి?**

కౌలు చట్టాల్లోనే సమస్య ఉంది. అవి తిరోగామి పద్ధతిలో ఉండటం వల్ల కౌలు రైతులు కష్టాల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2011, కౌలు రైతుల చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయత్నించింది. గుర్తింపు కార్డుల్ని ఇచ్చింది. కానీ అమలు అధ్వాన్నం. మాఫీలు, రుణాలకు చాలామంది కౌలురైతులు అర్హత సాధించలేదు. అసమానతలు ఇంకా పెరగటానికి ఇది దోహదం చేసింది. కాలం చెల్లిన చట్టాల కింద ఆస్తుల్ని పోగొట్టుకుం టామే మోనన్న భయంతో కౌలు రైతులకు రిజిస్టర్ చేయటానికి భూ యజమానులు వెనకడుగు వేశారు. కౌలు చట్టాల్ని సంస్కరించటానికి బదులు, ప్రభుత్వాలు కార్డు పద్ధతుల్ని ప్రవేశపెట్టటం వల్ల.. అరకొర ఫలితాలే వచ్చాయి.

**(?) అనేక రాష్ట్రాల్లో సంక్షేమం పేరుతో హామీల్ని ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చేస్తున్నారు, పెంచేస్తున్నారు. ఈ పరిణామాన్ని ఎలా చూడాలి**

అధోగతికి పోటీపడే రాజకీయం. 2006 ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే కలర్ టీవీల్ని మేనిఫెస్టో హామీగా ఇచ్చింది. నేను దీన్ని వ్యతిరేకించాను. ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటి?.. ఆ బాధ్యతలకు సంబంధించి ఎన్నికల్లో హామీల్ని ఇవ్వాలి. టీవీలు పంచటం ఏ రకంగా ప్రభుత్వాల రాజ్యాంగ బాధ్యత? డీఎంకే ఎన్నికల్లో గెలిచింది. దీంతో, 2011లో అన్నా డీఎంకే అధినేత్రి జయలలిత ఇంకా భారీ హామీలతో ప్రతీకారం తీర్చుకున్నారు. 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలనిచ్చింది. ప్రత్యర్థులు ఇంకా ఎక్కువ హామీలనివ్వాల్సిన పరిస్థితి కల్పించింది. ఆర్థికంగా ఆరోగ్యకరంగా ఉన్న కర్ణాటక కూడా ఈ తాత్కాలిక తాయిలాల రాజకీయ ఒత్తిడికి అభివృద్ధిని పణంగా పెడుతోంది. మాఫీలకు రూ.44,000 కోట్లు ప్రకటించింది. ఇది ఏమాత్రం ఆచరణసాధ్యం కాదు. ఆకలిగొన్న పులి లాంటి తాయిలాల పథకాల మీద పార్టీలు స్వారీ చేస్తున్నాయి. ఒకసారి మొదలెట్టాక, మీరు ఆపలేరు. ఎన్నిక తర్వాత ఎన్నికకు, ఓటర్లు ఇంకా ఇంకా ఎక్కువ ఖరీదైన తాత్కాలిక తాయిలాల్ని డిమాండ్ చేస్తుంటారు.

**(?) వ్యవసాయ రుణాల మాఫీపై చివరికి మీరు చెప్పేదేమిటి**

మాఫీలు రాజకీయంగా ఆకర్షణీయమైనవి, కానీ ఆర్థికంగా వినాశకరమైనవి. రైతుల పరపతి సంస్కృతిని ధ్వంసం చేస్తాయి. ప్రోత్సాహకాల్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. రాష్ట్రాల్ని అప్పుల్లోకి నెడతాయి. చివరికి రైతుల జీవితాల్ని కించిత్తు కూడా మెరుగుపరచలేవు. రైతులకు కావలసినది పనికొచ్చే, నిజమైన మద్దతు. అంటే.. సకాలంలో రుణాలు, సుస్థిర వ్యవసాయంలో పెట్టుబడులు, పార్టీలకు ఓట్లు సంపాదిం చేవి, భవిష్యత్తుని నాశనం చేసేవి కాకుండా.. రైతుల సామర్థ్యాన్ని పెంచే సంక్షేమం అందించటం. మనం లోపాల్ని సరిదిద్దుకునే నిజాయతీని ప్రదర్శించకుండా, మాఫీలే మార్గమన్నట్లు నటిస్తే.. వ్యవస్థ చివరికి తన భారానికి తానే చతికిలబడే రోజు వస్తుంది. ❖

**మాఫీలు రాజకీయంగా ఆకర్షణీయమైనవి, కానీ ఆర్థికంగా వినాశకరమైనవి. రైతుల పరపతి సంస్కృతిని ధ్వంసం చేస్తాయి. ప్రోత్సాహకాల్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. రాష్ట్రాల్ని అప్పుల్లోకి నెడతాయి. చివరికి రైతుల జీవితాల్ని కించిత్తు కూడా మెరుగుపరచలేవు. రైతులకు కావలసినది పనికొచ్చే, నిజమైన మద్దతు. అంటే.. సకాలంలో రుణాలు, సుస్థిర వ్యవసాయంలో పెట్టుబడులు, పార్టీలకు ఓట్లు సంపాదించేవి, భవిష్యత్తుని నాశనం చేసేవి కాకుండా.. రైతుల సామర్థ్యాన్ని పెంచే సంక్షేమం అందించటం.**

# రెండు రోజులు మాత్రమే సొంత సొమ్ముతో పాలన

## -తెలంగాణ ఆర్థిక నిర్వహణపై కాగ్-

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితి నివారించదగ్గ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికలో వెల్లడించింది. ప్రభుత్వం మీడియా పతాక శీర్షికల్లో ప్రకటిస్తున్న స్కీములకు, వాస్తవిక పరిస్థితికి మధ్య పెద్దఎత్తున అంతరం ఉన్నట్లు పరోక్షంగా స్పష్టం చేసింది.



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున రోజువారీ ఖర్చులకూ ప్రభుత్వం రిజర్వుబ్యాంకు నుంచి 'వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్', స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ (ప్రత్యేక నిధుల సేకరణ అవకాశం), ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) నిబంధనల కింద చేబదులు పేరుతో అప్పులు తీసుకుని నెట్టుకొస్తోంది. 2024-25లో ఏకంగా 363 రోజులపాటు ఇలా అప్పులు తీసుకున్నట్లు కాగ్ ఆడిట్‌లో తేలింది. తీసుకున్న సొమ్మును నిర్ణీత గడువులోగా రిజర్వుబ్యాంకుకు మళ్లీ చెల్లించాలి. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసే చివరి రోజు, అంటే 2025 మార్చి 31లోగా ఈ చేబదులు రుణాలన్నీ తిరిగి చెల్లించాలి. కానీ ఈ గడువు ముగిసిన తర్వాత కూడా ఇంకా రూ.5,842 కోట్లను తిరిగి చెల్లించలేకపోయారని కాగ్ వివరించింది.

☞ 2024-25లో స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కింద 363 రోజులు తాత్కాలిక అప్పు కింద రూ.27,930 కోట్లను ప్రభుత్వం తీసుకున్నట్లు కాగ్ స్పష్టం చేసింది. అంటే, కేవలం రెండు రోజులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం సొంత సొమ్ముతో నెట్టుకురాగలిగింది.

☞ ఇక 'వేస్ అండ్ మీన్స్' అడ్వాన్సెస్ నిబంధనల కింద 298 రోజులపాటు తీసుకున్న చేబదులు రుణాలు రూ.64,188 కోట్లుగా తేలింది.

**రూ.1.38 కోట్లు కూడా లేకుండా..**

ప్రతి రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో కనీసం కొంత సొమ్ము ఎప్పుడూ నిల్వ ఉండాలని రిజర్వుబ్యాంకు నిబంధనలున్నాయి. ఇలా తెలంగాణ ప్రభుత్వ ఖాతాలో రూ.1.38 కోట్లు ఉండాలి. వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కింద చేబదులు తీసుకున్న తర్వాత కూడా ఆ మాత్రం నిల్వ లేకపోతే ఆఖరి అస్త్రంగా ఓడీ కింద రిజర్వుబ్యాంకు నుంచి అప్పు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం 2024-25లో ఓడీని ఏకంగా 123 రోజులు వినియోగించుకుంది. దీని కింద తీసుకున్న మొత్తం రూ.37,457 కోట్లకు చేరింది.

తెలంగాణ శాసనసభలో వివిధ రంగాలపై 2021-25 మధ్యకాలానికి సంబంధించిన కాగ్ నివేదికలను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టారు. పంచాయతీరాజ్ స్థానిక సంస్థలు, భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పనితీరుకు సంబంధించి 2021-22 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదికను, 2022-23లో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, 2024-25లో రాష్ట్ర బడ్జెట్ ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికలను వేర్వేరుగా అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

**అవగాహనలేమితో ఆర్థిక శాఖ లెక్కలు**

రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో సరైన అంచనాలు లేవని, ఆదాయ వ్యయాలపై పొంతన లేదని కాగ్ ఆడిట్‌లో తేల్చింది. 2024-25 బడ్జెట్‌లో ఎంత ఆదాయం వస్తుంది, ఎంతవరకూ వ్యయం చేయవచ్చు అనే అంచనాలు లేకుండా ఆర్థిక శాఖ అవగాహనతో లెక్కలు వేయలేదని కాగ్ వెల్లడించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రకారం 2024-25లో మొత్తం రెవెన్యూ రాబడి రూ.2.21 లక్షల కోట్లకు పైగా ఉంటుందని తొలుత అంచనా వేసింది. కానీ రూ.1.67 లక్షల కోట్లే రాబడి ఉండటంతో, 363 రోజులపాటు చేబదులకి ఆర్‌బీఐ దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది.

**వాస్తవాలను పట్టించుకోకుండా అమృత్ డీపీఆర్‌లు**

రాష్ట్రంలో అమృత్ పథకం కింద చేపట్టే తాగు, మురుగునీటి, ఉద్యానాల ప్రాజెక్టులకు క్షేత్రస్థాయి అవసరాలు, వాస్తవాలు,

భూముల లభ్యతను పరిగణలోకి తీసుకోకుండా పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) సిద్ధం చేశారని కాగ్ తెలిపింది. తొలుత నిర్ణయించిన లక్ష్యాలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని వెల్లడించింది. నిజామాబాద్, వరంగల్ నగరాల్లో తాగునీటి ప్రాజెక్టులకు నీటి లభ్యత ఉన్నప్పటికీ, రిజర్వాయర్ నిర్మాణాలకు భూములు అందుబాటులోలేవని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం పీడీ ఖాతాలోకి సర్దుబాటు చేసిన రూ.1106 కోట్లను మిషన్ డైరెక్టరేట్ ఖాతాలోనే పెట్టటంతో వడ్డీ ఆదాయం కోల్పోయిందని తెలిపింది.

☞ యూనియన్ వాటా విడుదలయ్యాక రాష్ట్ర వాటా విడుదలకు 33 నుంచి 392 రోజుల ఆలస్యం జరిగింది. సంస్కరణల అమల్లో ఆలస్యం కారణంగా రాష్ట్రానికి రూ.208.30 కోట్లకు బదులుగా కేవలం రూ.51.40 కోట్లు మాత్రమే వచ్చాయి.

☞ సిద్దిపేట, నల్గొండ, కరీంనగర్ మునిసిపాలిటీల మురుగునీటి ప్రాజెక్టుల డీపీఆర్‌లకు పురపాలక నిధులకు బదులుగా, మిషన్ నిధులను వినియోగించారు.

☞ కరీంనగర్, నల్గొండ, నిజామాబాద్, రామగుండం, నల్గొండ నగరాల్లో తొలుత నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం నల్లా కనెక్షన్ల సంఖ్యకు, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఇచ్చిన కనెక్షన్లకు చాలా తేడా ఉంది. కరీంనగర్‌లో పంపిణీ వ్యవస్థ పొడవును 172 కి.మీ నుంచి 108కి తగ్గించటంతో ఆశించిన స్థాయిలో కనెక్షన్లు ఇవ్వలేదు. పలు నగరాల్లో నల్లా మీటర్లు అమర్చక పోవటం వల్ల మునిసిపాలిటీలు నీటి సరఫరా ఆదాయాన్ని కోల్పోయాయి.

☞ పరిపాలన అనుమతుల మంజూరులో జాప్యం, ఆలస్యంగా చెల్లింపులతో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టిన స్పోర్ట్స్ స్టేడియాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అసెంబ్లీ నియోజకవర్గానికొక స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి నిర్ణయించగా, 52 పూర్తయ్యాయి.

☞ వజ్ర బస్సులను సరైన సర్వే లేకుండా ప్రవేశపెట్టటంతో 100 బస్సులకు రూ.22.94 కోట్లు వృధా అయ్యాయి. వడ్డీ మరో రూ.3.99 కోట్లు నష్టం.

☞ హైదరాబాద్ మహానగరంలో చెత్త సేకరణ, నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) తీరులో అవకతవకల వల్ల రూ.కోట్లు పక్కదోవ పట్టాయి. 2012 ఫిబ్రవరి నుండి 2020 జులై వరకు తడి, పొడి చెత్తను వేరుచేయకున్నా.. టీ అండ్ డీ ఛార్జీల పేరుతో సంబంధిత సంస్థకు జీహెచ్‌ఎంసీ రూ.313.20 కోట్లు చెల్లించింది. ఎస్‌డబ్ల్యూఎంపై వార్డు కమిటీలు ఏర్పాటు చేయలేదు. రూ.2.29 కోట్ల పర్యావరణ ఇంపాక్ట్ ఫీజులకూ నష్టం జరిగినట్లు కాగ్ తేల్చింది. వంద కిలోల కంటే ఎక్కువ చెత్తని ఉత్పత్తి చేసే సంస్థల నుండి కూడా సాధారణ రుసుములనే వసూలు చేయటం వల్ల ఛార్జీ సేకరణలో పెద్దఎత్తున నష్టం వచ్చింది.

☞ తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలు, ఒక గ్రామ పంచాయతీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నుంచి రూ.47.77 కోట్ల టిప్పింగ్ రుసుమును వసూలు చేయటంలో జీహెచ్‌ఎంసీ విఫలమైంది.

☞ జీహెచ్‌ఎంసీతోపాటు రాష్ట్రంలోని 142 స్థానిక సంస్థల్లో 15 యూఎల్‌బీలను పరిశీలించిన కాగ్ వాటిలో లోపాలను ఎత్తిచూపింది. శివార్లలోని మునిసిపాలిటీల్లో చెత్త వేసేందుకు, పూడ్చి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించలేదు. ఫలితంగా బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయటం ప్రజారోగ్యానికి ముప్పుగా మారింది.

☞ సరైన నిబంధనల రూపకల్పన, అమలు కొరవడటం వల్ల 2022 మార్చి 31 నాటికి జీడిమెట్లలో 3,51,186 టన్నులు, ఫతుల్లాగూడలో 7,11,300 టన్నుల నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి.

☞ బీసీ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకంలో చాలామంది అనర్హులకు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు కాగ్ గుర్తించింది. ఆర్డీవోలు తనిఖీ చేయకుండా ఆమోదించినట్లు తెలిపింది.

☞ గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్‌కు ఆదాయ వనరుల్లో ఒకటైన పర్యావరణ ప్రభావ రుసుం (ఈఐఎఫ్)ల ఎగవేత భారీగా జరుగుతోందని కాగ్ తేల్చింది. 1052 కేసుల్లో 22.71 శాతం నష్టపోయినట్లు పేర్కొంది. చెత్త తరలింపు కేంద్రాల నిర్వహణ సరిగా లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇమ్లీబన్ వద్ద కనీస వసతులు కల్పించలేదు.

☞ జీహెచ్‌ఎంసీ వసూలు చేయాల్సిన గ్రంథాలయ సెస్ వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నట్లు కాగ్ తెలిపింది. గ్రేటర్ పరిధిలో వసూలైన రూ.321.51 (92%) కోట్ల సెస్సు నుంచి రూ.273.29 కోట్లు గ్రంథాలయ సంస్థలకు చేరలేదు. కేవలం 7% మాత్రమే జమ చేసింది.

☞ ఐటీ కారిడార్ తరహాలో ఫార్మా సిటీని నిర్మించేందుకు జాప్యం చేయటంతో రైతులు అధిక డిమాండ్ చేశారు. హడ్కో నుంచి రూ.740 కోట్ల రుణం తీసుకుని, ఆ రుణాన్ని పక్కదోవ పట్టించారు.

☞ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ ఆరేళ్లలో మసకబారింది. కోట్లలో నిధులు ఖర్చు పెట్టకపోవటం వల్ల వెనక్కి మళ్లాయని, పరిశోధన నిధులూ వినియోగమవలేదని కాగ్ తెలిపింది.

☞ సన్నాహకత లేకుండానే, సర్వే చేయకుండానే గ్రామీణ

రహదారుల పనులు అప్పగించటంతో అధికశాతం అసంపూర్తిగా ఉన్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనులకు తన వాటాను సకాలంలో విడుదల చేసినా, రాష్ట్ర వాటా విడుదలలో జాప్యం వల్ల నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. రోడ్ల నిర్మాణం తీరుతెన్నుల్లోనూ లోటుపాట్లున్నాయి. తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్వహణ విధానం–2017 ప్రకారం, ఏటా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తనిఖీలు సైతం నిర్వహించాల్సి ఉండగా, చేయలేదు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం వంటి చోట్ల సిమెంట్ కాంక్రీట్ దెబ్బ తినటం, నీటి కాలువలు మూసుకుపోవటాన్ని యూనియన్ ప్రభుత్వ అధికారులు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తెచ్చినా చర్యలు లేవు.

☞ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మోడికుంట వాగుపై జలాశయం నిర్మాణదారుకి అనుచిత లబ్ధి కలిగించేలా, ఆదిలాబాద్ జిల్లాలో చిన్న సుద్దవాగు ప్రాజెక్టు అంచనాల వైఫల్యం వల్ల రూ.19 కోట్లు వృధా వ్యయం జరిగేలా పాలకులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించారని కాగ్ పేర్కొంది.

☞ ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ సంక్షేమ శాఖ డ్రైవర్ సాధికారత పథకం కింద 33 మంది అయిదేళ్లలోనే రెండు సార్లు లబ్ధి పొందినట్లు కాగ్ తెలిపింది. వీటిపై సరైన దర్యాప్తు, చర్యలు లేకుండా వ్యవహరించిన అధికారులపై చర్యలకు సిఫార్సు చేసింది.

☞ 2023 మార్చి 31 నాటికి మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటిలో 8 విద్యుత్ రంగానికి, 75 విద్యుదేతర రంగానివి. వీటిలో 16 మూతపడగా, పనిచేస్తున్న 67 సంస్థల్లో 49 తమ వార్షిక నివేదికలు సమర్పించటంలో జాప్యం చేస్తున్నాయి. అందుబాటులో గణాంకాలు ఉన్న 18 సంస్థల్లో 11 రూ.11,969.66 కోట్ల నష్టాల్ని చవిచూశాయి. సింగరేణిలో తెలంగాణకు 51% వాటా ఉంది. ఈ సంస్థ ఒప్పందాలలో భారీగా నిధుల వృధా వెలుగులోకి వచ్చిందని కాగ్ తెలిపింది.

☞ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను బోర్డు సమర్థంగా అమలు చేయలేదని.. నిధుల దుర్వినియోగం జరిగిందని కాగ్ పేర్కొంది. రాష్ట్రంలో 14.83 లక్షల మంది కార్మికులు నమోదయ్యారు. కొన్ని పనులకు కాంట్రాక్టర్ల నుండి కార్మిక్ సెస్ మినహాయించటానికి బదులుగా ప్రభుత్వమే అంచనాల్లో కార్మికసెస్‌ను కలిపి గుత్తేదారులకు లబ్ధి చేకూర్చింది. ❖

## కాళేశ్వరం నీళ్లలో కొట్టుకుపోయిన కోట్ల రూపాయలు.. ఏం చేయాలో తీరిగ్గా ఆలోచిస్తున్నారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.లక్ష కోట్లు నీళ్లలో కొట్టుకుపోయినట్లు భావించాలని యూనియన్ జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యానించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభలో ప్రశ్నకు సమాధానమిస్తూ, "కాళేశ్వరంపై రూ.30 వేల కోట్లు ఖర్చు పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దాని ఎప్రైజల్ కోసం మా శాఖ వద్దకు వచ్చింది. తర్వాత కూడా యూనియన్ నుండి ఎలాంటి నిధులు తీసుకోలేదు. మా పరిధి కేవలం సాంకేతిక మదింపు వరకే కావటంతో అంతవరకే బేరీజు వేసి పంపాం. కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టింది. ఈ విషయం దేశానికంతా తెలుసు. ఆ నిధులన్నీ నీళ్లలో కొట్టుకుపోయాయి. ప్రస్తుతం దానిపై విచారణ కూడా జరుగుతోంది. ప్రాజెక్టును పునరుద్ధరించి ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై అధ్యయనం చేస్తున్న ఏజన్సీల పనితీరు చాలా నిదానంగా సాగుతోంది. దానివల్ల ప్రజలకు ఉపయోగపడాల్సిన నీళ్లు ఇంకా అందటం లేదు" అన్నారు. కాళేశ్వరంపై కాగ్ నివేదికకు సంబంధించి చర్యలు తీసుకునే అంశం రాష్ట్ర పరిధిలోకి వస్తుందని పాటిల్ తెలిపారు. ఆ నివేదిక తమ వద్దకు రాలేదని, తామేమీ స్పందించలేమన్నారు (వాస్తవ అంచనా విలువ కంటే 80% ఎక్కువ చేశారని కాగ్ పేర్కొంది). కాళేశ్వరం, అందుకు మూలమైన ప్రాణహిత–చేవెళ్ల వల్ల తెలంగాణ ప్రజలకు భారీ నష్టం వస్తుందని, పెట్టుబడికి, వచ్చే ఆదాయానికి పొంతన ఉండదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పలుమార్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ ప్రాజెక్టుకు బదులు అదే డబ్బును తెలంగాణ రైతులు, వారి పిల్లలకు ప్రత్యామ్నాయ రూపంలో వినియోగించి ప్రయోజనం కలిగించాలని జేపీ సూచించారు.

# ఇరాన్ యుద్ధం – ఊహించని పాఠాలు



యుద్ధానికి పక్కా ప్రణాళికతో సిద్ధమైనా, శత్రువుపై మొదటి దాడిలోనే అంతా తారుమారు కావచ్చు; ఊహించని పాఠాలు ఎదురవ్వొచ్చు. ఇది 19వ శతాబ్దపు ప్రష్యా దేశ ఫీల్డ్ మార్షల్ హెల్ముత్ వాన్ మోల్ట్‌కె నానుడిగా చెబుతారు. అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన ఇరాన్ యుద్ధానికైతే ఇది కచ్చితంగా వర్తిస్తుంది. "ఎత్తుగడలులేని వ్యూహం విజయానికి నత్తనడక మార్గం; వ్యూహంలేని ఎత్తుగడలు ఓటమికి ముందస్తు హెచ్చరికలు" అని క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో చైనా సైనిక వ్యూహకర్త సన్ జూ తన యుద్ధకళలో పేర్కొన్న మాటల్ని కూడా ట్రంప్ రుజువు చేశారు. ఇరాన్‌పై యుద్ధం ఎత్తుగడలో అద్భుతం, వ్యూహాత్మకంగా వైఫల్యం. వెరసి అమెరికాకి ఓ దుస్సాహసంగా అధ్యక్షుడు మార్చారు.

ఇంతకుముందు ఇదే అంశంపై రాసిన వ్యాసంలో ఒక విషయం పేర్కొన్నాను. అధ్యక్షుడు ట్రంప్ వైఫల్యం నైతికమైనదో, చట్టపరమైనదో కాదు; ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి నాయకుడిగా బాధ్యతా రాహిత్యమే ఆయన వైఫల్యమని వివరించాను. కానీ, ఇప్పుడు ఆ గీతనూ ట్రంప్ దాటేశారు. ఇరాన్ పౌర మౌలిక వసతులపై దాడులు చేశారు. ఇరానియన్లను "తిరిగి వారి రాతి యుగంలోకి పంపిస్తాం" అంటూ బెదిరించారు. దీంతో, ట్రంప్ వైఫల్యం నైతిక, చట్టపరమైనదిగా కూడా మారింది. హంతక మతతత్వ నిరంకుశ పాలనలో ఇరాన్ ప్రజలు సుదీర్ఘకాలంగా నలిగిపోతున్నారన్నది నిజం. కానీ ఇరాన్ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకునేలా చేసేందుకు ప్రారంభించిన పాక్షిక యుద్ధం కాస్తా.. ఇరాన్ ప్రజలపై, ఆ దేశంపై యుద్ధంగా పరిణమించటంలో ట్రంప్ మార్క్ వ్యవహారశైలి కీలకపాత్ర పోషించింది.

సమయం మించిపోతోంది. ఈ తుది అంకంలోనైనా, విజ్ఞుల సలహాలకు విలువ లభిస్తుందని ఆశ పడదాం. ఇరాన్ పౌరుల మౌలిక వసతులకు, వారి జీవితాలకు ప్రమాదం వాటిల్లదని భావిద్దాం. స్థానికంగా మధ్యఆసియాలో తమ చర్యలు అంతర్జాతీయంగా అంతులేని సంక్షోభానికి కారణమవుతున్నాయన్న స్పృహ, సహానుభూతి అమెరికా ప్రభుత్వంలో, రాజకీయ వ్యవస్థలో మచ్చుకైనా కనిపించకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. వేల సంవత్సరాల సముద్ర రవాణా చరిత్రలో మొట్ట మొదటిసారిగా హొర్ముజ్ జలసంధిని ఇరాన్ దుర్భేద్యమైన రీతిలో దిగ్బంధించింది. కీలక సరకు సరఫరాలకు తీవ్ర విఘాతం కలిగించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బందీ గావించింది. జీసీసీ దేశాలపై ఇరాన్ నిర్లక్ష్యపూరిత ప్రతీకార చర్యలు, జలసంధిలో సరకు ఓడలపై దాడులు అంతర్జాతీయ సంక్షోభానికి దారితీశాయి.

కానీ ఇవేమీ ఊహించనవి కావు. ఇరాన్‌లో ఉన్నది సొంత ప్రజల సంక్షేమాన్ని కూడా పట్టించుకోని, కేవలం తమ మనుగడ కోసం పోరాడుతున్న మతతత్వ పాలకులు. అటువంటివారు ఎంతకైనా తెగిస్తారు. అమెరికా ఆ విషయాన్ని అంచనా వేయకపోవటం, స్వేచ్ఛా వాణిజ్యానికి విఘాతం కలగకుండా హొర్ముజ్ జలసంధిని తెరిచివుంచటానికి ఒక ఆచరణసాధ్య ప్రణాళిక లేకుండా వ్యవహరించటం మాత్రం ఊహించనివి. జలసంధిని తెరిచివుంచటంపై అధ్యక్షుడు ట్రంప్ రోజుకో మాట చెబుతున్నారు. అది అమెరికా బాధ్యత కాదని కూడా అన్నారు. తన చర్యల వల్ల ఏర్పడిన దీర్ఘకాలిక అంతర్జాతీయ సంక్షోభంతో తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నపళంగా అమెరికా ఉపసంహరించుకుంటే, పర్యవసానాల్ని మిగతా

ప్రపంచమే భరించాల్సుంటుంది. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ, వాహనాలు నడవటానికి; ఇళ్లలో వెచ్చదనం, వంటలు వంటి అవసరాలకి.. చమురు, సహజ వాయువు ప్రధాన ఇంధనాలయ్యాయి. దీంతో శిలాజ ఇంధనాలకి గల్ఫ్ దేశాలు కీలక వనరులుగా రూపొందాయి.

పర్షియన్ జలసంధి, ఎర్ర సముద్రం ప్రపంచ నౌకా వాణిజ్యానికి అత్యంత విలువైన మార్గాలు. హొర్ముజ్ జలసంధిని దాదాపు మూసివేయటంతో.. రోజుకి సుమారు 15 మిలియన్ బ్యారెళ్ల చమురు, 30 బిలియన్ క్యూబిక్ అడుగుల సహజ వాయువు ప్రపంచ మార్కెట్లకి అందుబాటులో లేకుండా పోయింది. తక్షణం, సమీప కాలంలోనూ చమురు, గ్యాస్‌కి ఇతర ఇంధనాలు ప్రత్యామ్నాయం కాలేవు. ఈ శిలాజ ఇంధనాలు, ముడి పదార్థాల డిమాండ్‌కి ప్రత్యామ్నాయం లేదు. కాబట్టి, మార్కెట్ ధరలు ఉన్నకొద్దీ పెరుగుతుంటాయి. కొరతలు సాధారణమవుతాయి. చమురుతో రవాణాకు సిద్ధంగా ఉన్న ఓడల్లో అప్పటికప్పుడు కొనుగోలు ధర అంతర్జాతీయంగా (బ్రెంట్ ఆయిల్) ఏప్రిల్ 2న బ్యారెల్ 141 డాలర్లకి పెరిగింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత ఇదే గరిష్ట ధర. హొర్ముజ్ జలసంధిని మరికొన్ని వారాలపాటు మూసివుంచితే, ధరలు 200 డాలర్లు, ఆపైకి పెరుగుతాయి.

ఇరాన్ తైనాతీలైన హౌతీలు యెమెన్ నుండి యుద్ధంలో పాల్గొంటున్నట్లు ఇప్పటికే సంకేతాలిచ్చారు. బాబ్ అల్-మందబ్ జలసంధిని దిగ్బంధించటం ద్వారా వాళ్లు ఎర్రసముద్ర మార్గానికి విఘాతం కలిగిస్తే, సరఫరా సంక్షోభం ఇంకా తీవ్రమవుతుంది. చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. జీసీసీ దేశాల్లో ఇంధన మౌలిక వసతుల్ని, చమురు, గ్యాస్ క్షేత్రాలను నాశనం చేస్తామనే బెదిరింపుని ఇరాన్ నిజంగా అమలుచేస్తే, సరఫరా గొలుసు దీర్ఘకాలంపాటు దెబ్బతింటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సర్దుబాటుకి, కోలుకోవటానికి చాలా సమయం తీసు కోవచ్చు. భీకర దాడులు, ఉద్రిక్తతల నుండి వెనక్కి తగ్గి సాధారణ తరహా పరిస్థితుల్ని వేగంగా పునరుద్ధరించకుంటే.. ప్రపంచం ఆర్థిక విధ్వంసానికి చేరువైనట్లే. యుద్ధాన్ని ఏకపక్షంగా ప్రారంభించి ప్రపంచ సమస్యను సృష్టించి నప్పటికీ, అమెరికా మాత్రం తన చర్యల దుష్పరిణామాలకి గురి కాకుండా నిక్షేపంగా ఉంది.

గ్యాసోలిన్ (పెట్రోలు) ధరలు 30% దాకా పెరగటం మినహాయించి, అమెరికా ఆర్థిక వ్యవస్థ మీద పెద్దగా యుద్ధ ప్రభావమేమీ లేదు. చమురు, గ్యాస్‌లలో అమెరికా పూర్తి స్వయంసమృద్ధంగా ఉంది. చెప్పాలంటే, ఎగుమతిదారు కూడా. చమురు, గ్యాస్.. నిల్వచేయగలిగే వాణిజ్య సరకులు కావటం, ధరలు అంతర్జాతీయంగా నిర్ణయమవుతుండటం వంటి కారణాల వల్ల అక్కడ గ్యాస్ స్టేషన్ వద్ద మాత్రం ధరల పెరుగుదల కనిపిస్తుంది. భారత్ సహా చాలా దేశాల తరహాలో అమెరికా గనక ధరల నియంత్రణ చట్టాలను అమలు చేస్తే, ధరలు ఆ మాత్రం కూడా పెరగకుండా స్థిరంగా కొనసాగుతాయి. ఎందుకంటే, డిమాండ్ కంటే సరఫరా అధికం. అమెరికాకు ఇరుపక్కలా రెండు మహా సముద్రాలు, అట్లాంటిక్, పసిఫిక్ ఉన్నాయి. కాబట్టి, ఏకో నారాయణ. తన కోణం నుండే స్పందిస్తుంది, తన ప్రయోజనాలరీత్యానే వ్యవహరిస్తుంది. మరిముఖ్యంగా, ప్రపంచ ప్రజలు ఏమైనా మాకు అనవసరం అనుకునే అధ్యక్షుడి పాలనలోని హిలిస్ట్ ప్రభుత్వం ఏర్పడటం నిజమైన ప్రమాదం ఇరాన్‌ని రాతియుగంలోకి నెట్టేందుకు బాంబులు వేస్తామన్న ట్రంప్ బెదిరింపు వాస్తవరూపం దాలిస్తే, ఇరాన్‌లో లక్ష్యరహిత (నిహిలిస్టిక్) ప్రభుత్వం ఏర్పడవచ్చు. ఇది నిజమైన ప్రమాదం. అలాంటి ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో చమురు, గ్యాస్ క్షేత్రాలపై విచక్షణారహితంగా దాడులు చేయవచ్చు. దీనివల్ల, కీలక ఇంధన వనరులకి దీర్ఘకాలికంగా లేదా శాశ్వతంగా నష్టం జరుగుతుంది. ఇంకా నష్టం జరగకుండా శాంతి, కాల్పుల విరమణకి కొద్దిపాటి అవకాశం మిగిలివుంది గానీ.. ఇంధన సరఫరాలకు దీర్ఘకాలిక విఘాతం కలిగించే వినాశకర ప్రమాదమైతే ఇప్పటికే మొదలైంది. అధ్యక్షుడు ట్రంప్ "కొన్ని రోజుల" తర్వాతైనా విజయాన్ని ప్రకటించుకుని, దాడుల్ని విరమించుకోవటం దాదాపు ఖాయం. స్వదేశంలో రాజకీయ ఒత్తిడుల రీత్యా ఆయన యుద్ధం నుండి వైదొలగవచ్చు.

కానీ ఈ కొన్ని వారాల్లోనే ఇంధన వనరులకి, సరఫరా గొలుసులకి పునరుద్ధరించలేని నష్టం జరిగితే మాత్రం, మొత్తం మానవాళి ఒక తరం పాటు తీవ్రంగా నష్టపోతుంది. దశాబ్దాలపాటు అవకాశాలను జారవిడిచి అత్తెసరు అభివృద్ధికే పరిమితమైన మన దేశం ఎట్టకేలకు మేలుకొని వచ్చే తరంలోనూ ఆర్థికాభివృద్ధి వేగం కొనసాగుతుందన్న ఆశిస్తూ, ప్రయత్నిస్తున్న తరుణంలో ఇరాన్ యుద్ధం వచ్చిపడింది. యుద్ధం ఇంకా తీవ్రతరమై ఇంకొన్ని వారాలు కొనసాగితే మాత్రం భారత్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

అది మనకు దుర్భరం. అన్ని దేశాలూ ఏకమవ్వాల్సిన సమయమిది. భావజాలం, విశ్వాసం, భౌగోళికత, రాజకీయ విభేదాలు వంటి వన్నీ పక్కనపెట్టి కలసికట్టుగా వ్యవహరించాలి. సంఘటితంగా తమకున్న దౌత్య, ఆర్థిక బలాన్ని ఉపయోగించి ఈ విధ్వంసకర యుద్ధాన్ని ఆపాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, మానవాళి సంక్షేమానికి మరింత నష్టం కలిగించకముందే యుద్ధాన్ని నిలువరించాలి.

❖

# ఇరాన్ యుద్ధం - మన ధాన్యం రైతులు



ఇరాన్‌పై ఇజ్రాయిల్-అమెరికా దాడి యుద్ధంగా మారటం వల్ల రష్యా ఎక్కువ లబ్ధి పొందుతోందని, అంతర్జాతీయ సూత్రాలను ఉల్లంఘించి తమ మీద అన్యాయంగా రష్యా నాలుగేళ్లుగా చేస్తున్న యుద్ధం మరుగున పడిపోయిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వాపోయారు. చమురు, పలు నిత్యావసరాల ఖర్చు పెరగటంతో చాలా దేశాలు మిగతా విషయాలన్నీ వదిలేసి సొంత మనుగడ మీదే దృష్టి సారించాయి. తెలుగు రాష్ట్రాలూ మినహాయింపు కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమకు బేరాల్లేకుండా పోయాయని ఆందోళనలు చేస్తున్న ఆటోవాలాలు.. ఇప్పుడు ఇంధనం దొరికితే చాలన్నట్లు క్యూల్లో నిలబడుతున్నారు. గత కొన్ని తరాల్లో ఇంత ప్రభావం చూపిన యుద్ధం మరోటి లేదేమో. అందరి గొంతూ బలంగా వినిపిస్తోంది, జనాభాలో అత్యధికులుగా ఉన్న రైతులది తప్ప. అంబేద్కర్ పత్రిక 'మూక్‌నాయక్' పేరు ఈవేళ రైతులకి అతికినట్లు సరిపోతుంది. పంట పండించటం, ప్రభుత్వం కొంటే చాలనుకోవటం, ధరలు పెరిగితే అల్పసంతోషంతో సంబరపడటం, తగ్గితే రోజుల తరబడి మార్కెట్‌ల వద్దే పడిగాపులు కాయటం తప్ప.. ఎందుకు ధరలు తగ్గాయో ఆలోచించే శక్తి ఇప్పటికీ అత్యధిక రైతులకి సమకూరలేదు. ఇరాన్ యుద్ధం వల్ల ఇంధన ధరలతో పాటు.. చాలా వస్తువుల ధరలు పెరిగాయని మనకు తెలుసు. కానీ తగ్గినవి కూడా ఉన్నాయి. అందులో ప్రధానమైనది బియ్యం.

యుద్ధం ముప్పై రోజులు దాటాక ఒక ప్రధాన వార్తాపత్రిక ఈ విషయాన్ని రాస్తూ, 'వంట గ్యాస్, ఆహారపదార్థాలు, కొన్ని రకాల పండ్లు వంటి వాటి ధరలు పెరిగినా, బియ్యం ధరలు తగ్గటం వినియోగదారులకు ఊరట కలిగించే విషయం' అని పేర్కొంది. ఇందులో అభ్యంతరం చెప్పాల్సింది ఏముంది అనిపించవచ్చు. అన్నీ సవ్యంగా ఉంటే, ఇది ఒక మామూలు వార్త, సరిగా రాసిన వార్త అన్నది నిజమే. కానీ యుద్ధం వల్ల నష్టపోతున్న రైతుల సంఖ్యను, ఆ నష్టం వెనుక ఉన్న ప్రభుత్వాల వ్యవస్థాగత వైఫల్యాన్ని చూస్తే.. అది మామూలు వార్త కాదు. రాయాల్సిన తీరూ అది కాదు.

ఒకప్పటిలా మన దేశంలో ఆహార కొరత లేకున్నా, అన్నం తక్కువగా తింటున్నా.. ఇప్పటికీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వరి అత్యధికంగా పండిస్తున్నాం. వాటిని ప్రభుత్వం వారు ఎం.ఎస్.పి (కనీస మద్దతు ధర)కి కొనుగోలు చేస్తున్నారు. ఇంకా పాతకాలం ఆలోచనాతీరులోనే ఉన్న నేతలు, ఎకరాకి అయిదు లక్షల ఖర్చుతో సాగునీరందించే ప్రాజెక్టుల్ని సైతం అలవోకగా నిర్మించారు. నీళ్ల అందుబాటులోకి రాగానే వరి వేసేయటమే వ్యవసాయంలో గొప్ప సంస్కృతిగా రైతులు భావిస్తున్నారు. దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనైతే సరేసరి. కొద్దిమంది నేతలు తప్పు దిద్దుకునే ప్రయత్నం చేసి, వరికి బదులు వేరే పంటల్ని ప్రతి పాదించినా, రాజకీయ ఒత్తిడితో నాలుక మడతేయక తప్పలేదు. ఏతావాతా, ఎం.ఎస్.పి, బోనస్, ఉచిత విద్యుత్‌లతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుండగా, ఆహార గిడ్డంగుల్లో ధాన్యం గుట్టలుగా పేరుకుపోయింది. రైతులకు మహా అయితే పెట్టుబడి తిరిగిరావటం తప్ప.. లాభాలు వచ్చిన దాఖలాలు అరుదు. పూర్వకాలంలో మతిమాలిన జమిందారులు కూడా తమ జమానాలో ఇలాంటి అర్థంపర్థంలేని పద్ధతుల్ని కొనసాగించేవారు కాదు. 'ఇంత ధాన్యం ఎందుకు, ప్రభుత్వం కొని ఏం చేయాలి, ప్రజల డబ్బే గదా వృథా అవుతోంది, భవిష్యత్తులో రైతు బిడ్డలే కదా ఎక్కువగా నష్టపోయేది' అని గట్టిగా నిలదీసినవారు పౌర సమాజంలో కూడా చాలా తక్కువమంది. మీడియా సంగతి చెప్పనక్కర్లేదు. రైతేరాజు అంటూ, రైతుకి నష్టం చేసే పంటల పద్ధతులపైనే ఊదరగొడుతుంటుంది. జనాభాలో సగం మంది ఇప్పటికీ వ్యవసాయం మీద ఆధారపడిన ప్రమాదకర పరిస్థితి కొనసాగుతున్నా, ఆ తీవ్రతను మనం గుర్తించటం లేదు.

అలాగని వ్యవసాయం పూర్తిగా దండగా అంటే.. అదీ కాదు. ఆహారంతోపాటు, ఇంధన ఉత్పత్తిలో కూడా వ్యవసాయానికి కీలకపాత్ర ఉంది. వ్యవసాయంలేని సమాజాన్ని ఊహిం చలేం. అంతెందుకు, ఏఐ సాంకేతికత అత్యధిక ప్రయోజనం ఈ రంగంలోనే ఉంటుందని అంచనా. అయితే, ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలి, డిమాండ్-సప్లయ్ మధ్య అంతరం లేకుండా చేసి రైతులకి, వినియోగదారులకి ఎలా లాభం చేయాలి, మన కంటే అతి తక్కువ సాగుచేసే దేశాలు అత్యధిక వ్యవసాయోత్పత్తుల ఎగుమతిదారులు ఎలా

కాగలిగాయి, వ్యవసాయం మీద మరీ ఎక్కువమంది ఆధారపడటం వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించటానికి ఏం చేయాలి, ఇరాన్ యుద్ధం వంటి పరిస్థితులు వచ్చినప్పుడు నష్టం జరగకుండా మనం నిల్వ, మార్కెటింగ్‌లో ఎలాంటి వ్యూహాలను అనుసరించాలి.. మొదలైన అంశాలపై చర్చ కావాలి.

లోక్‌సత్తా జేపీ కృషి వల్ల బియ్యం ఎగుమతులపై దేశీయంగా, విదేశాలకు ఆంక్షలు తొలగాయి. 2010-11లో మొదలైన ఈ ఎగుమతులు కొన్నేళ్లలోనే కోటి టన్నులకు చేరి ప్రపంచంలోనే రికార్డు స్థాయికి చేరాయి. అందులోనూ ఎక్కువ లబ్ధి పొందినది తెలుగు రాష్ట్రాలే. అయితే ఈ ఎగుమతుల్లోనూ నిలకడలేకపోవటం, ఎంత ఎగుమతి చేసినా కొంత పరిమితి ఉండటం వల్ల, రైతుల్లో అత్యధికులు వరి సాగుచేయటం తెలంగాణ, ఏపీ సహా ఆయా రాష్ట్రాలకు, అంతిమంగా దేశానికి నష్టదాయకం. రైతులకూ ఆదాయం రాదు. ఇంకొన్ని వ్యవసాయోత్పత్తులకూ ధరలు తగ్గినా, వాటిల్లో, వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభాన్ని వెలికితీయటానికి బియ్యంపై చర్చ గొప్ప అవకాశంగా ఉపయోగపడుతుంది. కనీసం యుద్ధ హడావుడి ముగిశాకైనా, ఈ చర్చ జరగాలి.

**చర్చలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలు:**

కొన్ని ఎగుమతయ్యే కూరగాయలు, పండ్లు వంటివి కుళ్లిపోయే అవకాశం వల్ల ఒకేసారి దిగుబడి మార్కెట్‌లోకి వచ్చినా.. రేట్లు పెరిగాయి. అదేవిధంగా, ఇప్పటికీ స్వావలంబన సాధించకుండా తాత్సారం చేస్తూ దిగుమతులు చేసుకుంటున్న పంట ఉత్పత్తుల రేట్లూ పెరిగాయి. స్వల్పకాలంలోనే రేట్లు పెరగటం వీటి విషయంలో పెద్దగా తప్పు పట్టలేం. అయితే బియ్యం విషయం అలా కాదు. నిల్వ ఉండేది, సరైన విధానాలుంటే.. ధర మరీ రోజుల వ్యవధిలో పడిపోయే అవకాశం తక్కువ.

బియ్యం రవాణా నౌకలు నిలిచిపోవటం వల్ల ఏప్రిల్ మొదటివారానికి సుమారు 4,00,000 టన్నుల మేర సరకు లావాదేవీలు స్తంభించాయి. కోటి టన్నుల పైగా ఎగుమతుల్లో ఇది చాలా స్వల్పం. ఈ మాత్రానికే ఒక్కసారిగా బాస్మతి బియ్యం ధరలు సగానికి సగం పడిపోయి కిలో రూ.60 అయ్యాయి. మిల్లులు సన్న బియ్యం ధర క్వింటాలుకు రూ.350 దాకా తగ్గించాయి. ఇంత వేగంగా, అసాధారణంగా పతనం అంటే.. ఉత్పత్తి నుండి మార్కెట్ దాకా మన ఫార్ములాలో ఎక్కడో పెద్ద మౌలిక లోపం ఉంది. కాస్త హేతుబద్ధంగా పరిశీలిస్తే, అర్థమయ్యే కొన్ని లోపాలు:

ఎ) అవసరానికి మించి మనం ఎక్కువ బియ్యం ఉత్పత్తి చేస్తున్నాం. నీరుంటే వరి పంట వేసేయటమే.

బి) దేశీయంగా ఆంక్షల్ని రాష్ట్ర ప్రభుత్వాలే ఇప్పటికీ అడపాదడపా కొనసాగిస్తున్నాయి. విదేశాలకు ఎట్టకేలకు ఎగుమతుల్ని ప్రారంభించినా కొన్ని దేశాల మీదే ఆధారపడుతున్నాం. ఉదాహరణకు, కొన్ని ఆఫ్రికా దేశాల్లో బియ్యానికి విపరీత గిరాకీ ఉన్నా, మనం పట్టించుకోలేదు. దేశీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతాయనుకుంటే.. నిజమైన అవసరం, వినియోగదారుల స్తోమతు, రైతులకు ఆదాయం, దేశ ఆర్థికాభివృద్ధితో సంబంధంలేకుండా ఎగుమతుల్ని నిషేధిస్తున్నాం.

సి) డిమాండ్ ఉన్న పంటల్ని పండించటం లేదు

డి) ధాన్యం నిల్వ, వాటి తనఖాతో తక్కువ వడ్డీ రుణ సదుపాయానికి (ప్లెడ్జి లోన్లు) తగిన ఏర్పాట్లు చేయలేదు

ఇ) డిమాండ్ ఉన్న పంటల్ని పండించినా, వాటిని అంతర్జాతీయ ఎగుమతుల మార్కెట్‌లోకి తీసుకెళ్లటానికి తగిన నైపుణ్యాల్ని ఇంకా సంతరించుకోలేకపోయాం

ఎఫ్) ఎరువులకు సబ్సిడీ అహేతుకంగా కొనసాగిస్తూ, మితిమీరి వినియోగిస్తూ వేల కోట్లు వృథా చేస్తున్నా పట్టించుకోవటం లేదు. అదేవిధంగా ఉచిత విద్యుత్తు, నీరు రైతులే కాకుండా, వారి పేరు చెప్పి ఇతర వర్గాలు దుర్వినియోగం చేస్తున్నా లెక్కలు, జవాబుదారీతనం లేవు.

జి) అన్ని వనరులూ అందుబాటులో ఉన్నా, ఉత్పాదకతలో చాలా దేశాల కంటే వెనుకబడి ఉన్నాం. దీనికితోడు, ఇచ్చే సబ్సిడీలు, ఉచితాలు కూడా సరైన రీతిలో ఉండకపోవటం వల్ల రైతుకి ఖర్చు ఎక్కువవుతూ, లాభం కనిపించటం లేదు. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ దిగుబడుల్లో మార్పులకు తగ్గట్లు ఇప్పటికీ సంసిద్ధం కాలేదు

హెచ్) వ్యవసాయ ఉత్పాదకత, మార్కెటింగ్‌లో ప్రపంచంలోనే ఆదర్శవంతమైన దేశాన్ని తీసుకుని ఆ మేరకు మన దేశంలో లెక్కలు వేసుకున్నా, వ్యవసాయం మీద అంతమంది ఆధారపడితే, ఎవరికీ లాభాలు రావు. వారికి మిగిలిన కొద్దిమంది జనాభా సబ్సిడీలు ఇవ్వలేరు. కానీ మనం అసంబద్ధ, అనాలోచిత విధానాలతో ఆ దిశగా వెళుతున్నాం.

ఇరాన్ యుద్ధం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా ఆసియాలో రాజకీయ సమీకరణాల్ని పూర్తిగా మార్చేస్తుందని చాలామంది వాస్తవికంగానే అభిప్రాయపడుతున్నారు. భారత్‌పరంగా ఇప్పటికే కొన్ని మార్పులు గావించుకున్నాం. పలు దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాల్ని కుదుర్చుకున్నాం. స్వదేశీ మార్కెట్ బలాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం. ఇవన్నీ రోజుల వ్యవధిలోనే చేశాం. అదేరీతిలో వ్యవసాయంలో కూడా ముందు.. ప్రోత్సాహకాల్ని మార్చాలి. ధాన్యం వంటి డిమాండ్‌లేని పంటలకు ఎం.ఎస్.పి

విధానాన్ని తొలగించాలి. ఆహారధాన్యాల సేకరణను ఇబ్బడిముబ్బడిగా కాకుండా.. శాస్త్రీయంగా అవసరం మేరకే నిల్వలు ఉండేలా సంస్కరించాలి. ఆ సేకరణను కూడా కేంద్రీకృతం చేయకుండా, వికేంద్రీకరించాలి. డిమాండ్ ఉన్న పంటలను, నీరు తక్కువ వినియోగించే పంటలను ప్రోత్సహించాలి. వృథా అవుతున్న ఉచిత విద్యుత్, ఎరువుల సబ్సిడీలను పునర్వ్యవస్థీకరించి రైతులు సొంత డబ్బుగా ఆదా చేసుకునేలా నగదు బదిలీ రూపంలో ఇవ్వాలి. సర్క్యులర్ ఎకానమీ ద్వారా స్థానికంగానే ఎరువుల తయారీ వంటి వాటిని ప్రోత్సహించాలి. చిన్న కమతాల ఏకీకరణకు విధానాలు అమలు చేయాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలతో గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ప్రోత్సహించాలి. వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్యను తగ్గించటంతోపాటు.. మహిళలు సహా రైతులంతా ఏఐ సాంకేతికతలో ఆరితేరేలా చేయాలి. దేశీయంగానే కాకుండా, విదేశీ ఎగుమతులకు సన్నద్ధం చేయటం, అందులో భాగంగా వ్యవసాయ, గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించటానికి పెద్దఎత్తున కృషి చేయాలి. ఎగుమతుల మార్కెట్‌లను ప్రపంచపటంలో పేరున్న ప్రతి దేశానికీ విస్తరించేందుకు కృషి చేయాలి. అందుకోసం రైతు ఎగుమతి సంఘాలను ఏర్పాటు చేయాలి. నష్టం వచ్చినా కష్టపడి పనిచేసే, ఎన్నిసార్లు ఓడినా కింగ్ సాల్మన్‌లా తిరిగి ఆశావాదంతో ప్రయత్నించే రైతులున్న గొప్ప సమాజం మనది. వారికి అవకాశం ఇస్తే చాలు, వినియోగదారుల కోసం వారిని నష్టపరచకుండా ఉంటే చాలు.. ప్రపంచంలోనే గణనీయ విజయాన్ని సాధించి చూపుతారు. మన విద్యార్థుల్లో కొద్దిమందే ప్రపంచస్థాయిలో పోటీపడగలరు గానీ, మన రైతుల్లో అత్యధికులు ఏ దేశంలోని రైతులతోనైనా అలవోకగా నెగ్గగలరు. అయితే, వ్యవసాయంలో విధానాల్ని, ప్రోత్సాహకాల్ని సమూలంగా, ఆచరణసాధ్యంగా మార్చాలి. వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్యను తగ్గించి వ్యవసాయ, తయారీరంగం, పట్టణీకరణలను అనుసంధానించే ఆర్థిక నమూనాను ప్రోత్సహించాలి. పంచాయతీలను పునర్వ్యవస్థీకరించి క్లస్టర్లుగా ఏర్పాటు చేసి చిన్న పట్టణాలతో స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తే.. రైతు లాభం దేశ ఆర్థిక వ్యవస్థ లాభంగా మారుతుంది. ❖

# కొఠియా గ్రామాల సమస్యను పరిష్కరించండి: ముఖ్యమంత్రికి లోక్‌సత్తా లేఖ




ప్రతి నిత్యం ఘర్షణ వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ జీవితాల్ని గడుపుతున్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు గ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి రాసిన లేఖను ఆయన విజయనగరంలో మీడియా ద్వారా ప్రజలకు విడుదల చేశారు. కొఠియా గ్రామాల సమస్య పరిష్కారం కోసం కొన్నేళ్లుగా లోక్‌సత్తా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. తాజా జనగణనతో మళ్లీ వివాదం తీవ్రతరమైంది. కొఠియాలోని 21 గ్రామాలు గిరిజన ప్రజల ఆవాసాలు. జనగణన విషయంలో తమకు సహకరించలేదని గంజాయిభద్ర పంచాయతీ ఎగువశెంబి గిరిజనులను ఒడిశా పోలీసులు అరెస్టు చేయటం ఆవేదన కలిగిస్తోందని బాబ్జీ అన్నారు. 1968 నుండి సరిహద్దు వివాదాలు నడుస్తున్నాయని, 1988లో సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, 2006లో స్టేటస్‌కో వచ్చిందన్నారు. ఆర్టికల్ 131 ప్రకారం కోర్టు చెప్పదు కనుక, పార్లమెంటులో నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం సూచించిందన్నారు. అన్ని గ్రామాల గిరిజనులు ఏపీలో ఉంటామంటున్నా, ఒడిశా ప్రభుత్వం నిర్బంధంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించేలా యూనియన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు చొరవ తీసుకుని, గిరిజనుల అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో గ్రామస్తులు గందరగోళంలేకుండా, స్వేచ్ఛగా పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్రరాజు, అల్లంశెట్టి నాగభూషణం, పి.ఎల్.ఎన్ రాజు, బోర రమేష్, ఇప్పలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

# బంగారం చెలామణిలోకి తెద్దాం.. కొంతకాలం దిగుమతులు ఆపేద్దాం,

# దేశ ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని పరిరక్షించుకుందాం: జేపీ



భారత్ ముడిచమురు అవసరాల్లో 85% వరకు దిగుమతుల మీదే ఆధారపడి వుందని; ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం వల్ల కేవలం చమురు, లిక్విఫైడ్ సహజ వాయువు అవసరాలకే అదనంగా 60-100 బిలియన్ డాలర్లు భారత్ వెచ్చించాల్సి వస్తుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. శిలాజ ఇంధ నాల్ని పరిమితం, దిగుమతుల అవ సరంలేకుండా చేసి.. పునరుత్పాదక ఇంధనాల్లో స్వయంసమృద్ధిని సాధించటానికి కొన్నేళ్ల సమయం పడు తుందన్నారు. ఈలోగా యువ భారత్ తనకున్న సమ్మిళిత అభివృద్ధి అవకాశాన్ని కోల్పోకుండా ప్రజలు కూడా ముందుకొచ్చి సహకరించాలన్నారు.

"మన ఇళ్లల్లో ఉన్న బంగారాన్నే ఉపయోగించుకుందాం, చెలామణిలోకి తెద్దాం, పెట్టుబడులుగా వినియోగించు కుందాం, కొన్నేళ్లపాటు బంగారు దిగుమతుల్ని ఆపివేద్దాం, ఆ డబ్బుతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దాం" అని జేపీ పిలుపునిచ్చారు.

మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి నేతల పిలుపుకి స్పందించి దేశాన్ని కాపాడుకున్నామని, ఈవేళ అలాంటి ఆర్థిక విపత్కర పరిస్థితిని భారత్ ఎదు ర్కొంటోందన్నారు.

"బంగారం మన సామాజిక సంస్కృతిలో అంతర్భాగం. సెంటిమెంట్. అందువల్ల ఈ మాటలు చెప్పటానికి ప్రభు త్వాలు సాహసం చేయవు. కానీ ఎవరోకరు నిజాయతీగా, స్పష్టంగా, ఆచరణసాధ్యంగా చెప్పాలి. మానవ చరిత్రలో వెలికితీసిన మొత్తం బంగారంలో 17-18% మన దేశంలోనే ఉంది. సుమారు 35,000 టన్నుల దాకా ఉంటుంది. ఇందులో 98% దాకా ప్రజల దగ్గరే ఉంది. ప్రభుత్వం వద్ద కొన్ని వందల టన్నుల పసిడి మాత్రమే ఉంది. ఇంత బంగారం ఉన్నా, రోజువారీ జీవితంలో పెద్దగా ఉపయోగించకున్నా.. ప్రతి సంవత్సరం ఇంకా ఇంకా బంగారం దిగుమతి చేసుకుంటున్నాం. అస్థిరతలు, అంతర్జాతీయ వాణిజ్య శక్తుల ఎత్తుగడల వల్ల బంగారం ధరలు ఆకాశానికంటుతున్నాయి. అయినా, మనం 2025-26లో రూ.6,65,000 కోట్ల విలువైన పసిడిని దిగుమతి చేసుకున్నాం. అంతకుముందు ఏడాది కంటే ఇది వ్యయం రీత్యా 24% ఎక్కువ. గత సంవత్సరం మన వస్తువుల దిగుమతిలో 10% బంగారానికే ఖర్చయింది. ఈవేళ మన ఇళ్లల్లో, లాకర్లలో నిరుపయోగంగా ఉన్న బంగారం విలువ మొత్తం భారతదేశ స్థూల జాతీయ ఉత్పత్తిని మించి ఉంటుంది. అందుకే బంగారాన్ని మన దేశంలో 'షాడో జీడీపీ' అంటారు.

"ఈ నేపథ్యంలో కొంతకాలంపాటు విదేశాల నుండి దిగుమతి నిలిపివేద్దాం. ఉన్న బంగారాన్ని రీసైకిల్ చేద్దాం. అవసరాలకి ఉపయోగించుకుందాం, వాడుక లోకి తెద్దాం. దీనివల్ల దేశ ఆర్థికవ్యవస్థకి కనీసం కొన్ని లక్షల కోట్ల లోటును పూరించగలం. రూపాయి అస్థిరతను అడ్డుకోగలం. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకునేందుకు.. క్రమంగా వివిధ ఉత్పత్తుల దిగుమతు ల్ని తగ్గించుకుని, ఎగుమతుల్ని పెంచుకుందాం. ఇందులో మనం ఇస్తున్న ఉచితం, చేస్తున్న త్యాగం ఏమీ లేవు. కేవలం అవగాహనతో దేశానికి, తద్వారా మనకి ఉపయోగపడేలా బంగారం విలువని సద్వినియోగం చేసే ప్రయత్నం. దేశ సమ్మిళిత ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని కాపాడుకునేందుకు కలసిరండి" అని జేపీ విజ్ఞప్తి చేశారు.

❖

# అంబేద్కర్ కలగన్న భారత్ సాధించింది ఎంత, సాధించాల్సింది ఎంత?




తెలుగు రాష్ట్రాలు సహా మన దేశంలో పిల్లలకు పాఠశాల స్థాయి నుండి మంచి ప్రమాణాల విద్య అందటం ముఖ్యం తప్ప.. డ్రాపౌట్లు సమస్య కాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. సమాజంలో మేధావులుగా ఉన్నవారు కూడా పూర్వకాలం ఆలోచనాతీరుతో, భాషతో తల్లిదండ్రుల్ని, విద్యావ్యవస్థని పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా 'మహాజనశక్తి' సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన మేధావుల సమ్మేళనంలో జేపీ పాల్గొన్నారు. 'అంబేద్కర్ కలగన్న భారత్ సాధించింది ఎంత, సాధించాల్సింది ఎంత?' అనే చర్చాంశంపై జేపీ మాట్లాడుతూ.. భారత్ సమ్మిళిత అభివృద్ధి సాధించే అవకాశానికి మరీ ఎక్కువ సమయంలేదని, విద్యను ప్రభుత్వ పాఠశాలలే అందించాలనటం ఇలాంటి పరిస్థితుల్లో ఛాందసమవుతుం దన్నారు. సర్కారీ బడులను ఇంత నాశనం చేశాక.. వాటిని బాగుచేసే శక్తి దేవుడికి కూడా లేదన్నారు. విద్యను అందించవద్దని ప్రభుత్వాల్ని, నాయకుల్ని ఎవరైనా అడ్డుకున్నారా? ఎందుకు మంచి విద్యను అందించలేదు మీరు? అని ప్రశ్నించారు. ఇప్పుడున్న దేశావసరాలరీత్యా ప్రభుత్వమా, ప్రయివేటా అన్న చర్చ అనవసరమని, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యం కావాలన్నారు. ఉస్మానియా వంటి విశ్వవిద్యాలయాల్ని బాగు చేయటం గురించి తర్వాత మాట్లాడుకుందామని, అసలు పాఠశాల విద్యే సరిగ్గాలే నప్పుడు ఉన్నత విద్య గురించి కబుర్లు వృథా అన్నారు. ప్రభుత్వమే అన్నీ చేయాలనే సైద్ధాంతిక ప్రతిపాదన (హైపోథసిస్)ను తిరస్కరించాలన్నారు. ప్రయివేటు అంటే బూతుమాట కాదన్నారు. ప్రయివేటు అంటే.. సమాజం లోని మనందరం అన్నారు. యూని వర్సిటీ పట్టాలిస్తే, ప్రభుత్వం ఉద్యోగా లివ్వాలన్నట్లు మాట్లాడుతున్నారని, ఇంతకంటే పచ్చి మోసం లేదన్నారు. ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది – మన పన్నుల డబ్బుతో ఉమ్మడి సేవలను సక్రమంగా అందించటానికి తప్ప డిగ్రీ కాగితాలున్నవారిని తేరగా కూర్చోబెట్టి జీతాలివ్వటం కోసం కాదన్నారు. అబద్ధాలాడి సమాజాన్ని చెడగొట్ట వద్దన్నారు. కులం, డబ్బు ప్రభావం వల్ల రాజకీయాల్లోకి సమర్థులు రాలేకపోతున్నారని, ఎన్నికైన వారు రాజ్యాంగ విలువల్ని కాపాడటంలో విఫలమవు తున్నారన్నారు. అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ ప్రజాస్వామ్యబద్ధ మార్గంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించటం, నివారించదగ్గ బాధలను తొలగించటానికి ప్రభుత్వాలు సవ్యంగా పనిచేసేలా మనందరం సరైన డిమాండ్లు చేయాలన్నారు. డబ్బు వెదజల్లాల్సిన అవసరం లేకుండా సమర్థులు, నిజాయతీపరులు చట్టసభల్లోకి ప్రవేశించగలిగే రీతిలో దామాషా వంటి ఎన్నికల సంస్కరణల్ని అమలు చేయాలని జేపీ పేర్కొన్నారు. సీనియర్ సంపాదకులు సతీష్ చందర్, సురేష్ కొచట్టిల్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ❖

# కుటుంబంలో ప్రజాస్వామ్యం ఉంటేనే సమాజ ప్రజాస్వామ్యం

## -బండారు రామ్మోహనరావు-




సమాజంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మొదట కుటుంబంలో ప్రజాస్వామ్య భావనలు వెల్లివిరియాలని ఆ తర్వాత మాత్రమే సమాజంలో అలాగే రాజకీయాల్లో కూడా ప్రజాస్వామ్య భావనలు మరింత పరిపుష్టం అవుతాయని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్ రావు అన్నారు. మే 6వ తేదీ గుంటూరులోని నాగార్జున విశ్వ విద్యాలయం సెమినార్ హాల్లో "ప్రజాస్వామ్యం– సమస్యలు– పరిష్కారాలు" అనే అంశంపై జరిగిన ఒకరోజు సెమినార్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా ఆ సమస్యల పరిష్కా రానికి మరింత ప్రజాస్వామ్యమే మంచి మందు" అని ఆయన అన్నారు. ఇటీవల ఎన్నికలు జరిగి ఫలితాలు వెల్లడి అయిన అస్సాం, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, కేరళతో పాటు ముఖ్యంగా తమిళనాడులో జరుగుతున్న చిత్ర విచిత్ర పరిణామాల క్రమాన్ని చూస్తే ప్రజాస్వామ్యం ఎలా ఉందో తెలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నికలలో మద్యం, డబ్బు ప్రమేయం ఎక్కువ యిందని దానివల్ల మంచివారు రాజకీయాల్లోకి రాకుండా పోతున్నారని రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**దామాషా విధానమే పరిష్కారం.**

**మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు**

ప్రజాస్వామ్య సంస్కరణలతో పాటు రాజకీయ ఎన్నికల సంస్కరణలు, రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజా స్వామ్యం పెరిగినప్పుడు మాత్రమే సుపరిపాలన సాధ్యమవు తుందని మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎన్నికలలో ప్రస్తుతం జరుగుతున్న ఫస్ట్ ఫాస్ట్ ద పోస్ట్ (FPTP) పద్ధతి మారి దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పుడు ఎన్నికలలో డబ్బు మద్యం ప్రమేయం తక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. కొలీజియం వ్యవస్థతో న్యాయమూర్తుల నియామకం జరగడం వల్ల న్యాయ వ్యవస్థలో కూడా జవాబుదారీతనం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమంగా ప్రజల చైతన్యం పెరిగినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యంలో పాలకులు సేవకులు అవుతారని లక్ష్మణరావు అన్నారు.

**డిజిటల్ ప్రజాస్వామ్య వేదిక అవసరం**

**మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ రామకృష్ణ**

ప్రజలకు డిజిటల్ ప్రైవసీ అవసరమని ప్రభుత్వాలు పౌరుల హక్కులను హరిస్తూ గోప్యతకు భంగం కలిగిస్తూ డిజిటల్ ప్రైవసీని దెబ్బతీస్తున్నాయని డిజిటల్ ప్రజా స్వామ్యం కూడా అవసరమని మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ రామకృష్ణ అన్నారు. సోషల్ మీడియా వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో అంత నష్టం కూడా ఉందని యువత విద్యా ర్థులు సోషల్ మీడియా బారిన పడకుండా ఉండాలంటే మొదట కుటుంబం తర్వాత పాఠశాల తర్వాత కళాశాల ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు.

ఈ సమావేశం నిర్వాహకులు ప్రొఫెసర్ అబ్బయ్య, ప్రొఫెసర్ కృష్ణమోహన్ తో పాటు గుంటూరు కు చెందిన మానసిక కౌన్సిలర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రొఫెసర్ అరవింద్ సామాజిక కార్యకర్త వీర శేఖర్, పద్మ రాణి, పవిత్ర, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన శివకుమార్,






చిలకలూరిపేటకు చెందిన న్యాయవాది భాను ప్రసాద్, హైదరాబాదులోని హైకోర్టు న్యాయవాది బండారు రామ్ ఫణిధర్‌రావు, జుగాడ్ ఓటర్ల ఉద్యమకారుడు పార్థసారథి తో పాటు నాగార్జున యూనివర్సిటీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యము సమస్యలు పరిష్కారాలపై జరిగిన వర్క్ షాప్‌లో గ్రూపుల వారి చర్చలు జరిపి చివరగా పరిష్కారాలు సూచించి పత్రాలు సమర్పిం చారు. పాల్గొన్న వారందరికీ అంబేద్కర్ చేర్ డెమొక్రటిక్ ఫోరం ప్రతినిధులు పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు అందజేశారు.

❖

## ఉద్యోగుల, ప్రజాప్రతినిధుల పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే లా లోకేష్ చర్యలు తీసుకోవాలి: భీశెట్టి




రాష్ట్ర మంత్రిగా సవాళ్లతో కూడిన విద్యాశాఖను చేపట్టిన నారా లోకేష్ విద్యా శాఖలో మార్పుల కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారని ఏపీ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు . అక్కయ్య పాలెం కార్యకర్తల సమావేశంలో అయన మాట్లా డుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పు కోసం లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నిరంతరం కృచేస్తూనే ఉన్నారని, గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకు వివరాలతో కూడిన నివేదికలు అనేక సార్లు అందచేశారని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి మంత్రి లోకేష్ తీసుకున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఉపయోగ పడిందని, ఇందులో షైయినింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్ పేరుతో విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన అందించారని భీశెట్టి అన్నారు . గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(జి.ఎఫ్. ఎల్. ఎన్ )అమలు కూడా మంచిదని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలన్న పూర్తి స్థాయిలో మంచి విద్యా మౌలిక సదుపాయాలు విద్యార్థులకు ఉపయోగ పడాలన్నా తప్పని సరిగా ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలనే నిబంధన మంత్రి లోకేష్ పెట్టాలని భీశెట్టి కోరారు, దీనివల్ల పాఠశాలల సమస్యలు వెనువెంటనే అధికారుల, ప్రభుత్వం దృష్టికి వచ్చి పరిష్కారం అవుతాయని అన్నారు. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ రాసిన విద్యా వ్యవస్థ మార్పు కోసం తీసుకోవలసిన చర్యలు పుస్తకాన్ని విడుదల చేశారు సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు ఎమ్.ఎస్. ఎన్. మూర్తి, నార్త్ అధ్యక్షుడు గొట్టాపు సుధీర్, ఆయసోమయాజుల నాగభాస్కర్, ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

### భీమసింగి ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళనకు మద్దతు

ఫ్యాక్టరీ మూతపడి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు కార్మికులకు అందాల్సిన పీఎఫ్, గ్రాట్యూటీ బకాయిలు చెల్లించలేదు. దీంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు ఏపీ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మద్దతు తెలిపారు. ఫ్యాక్టరీలో ఉన్న యంత్రాలను అమ్మేసి కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని బాబ్జీ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి చక్కెర కర్మాగారం ఎండీకి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035,ఈమెయిల్: mpstexer@gmail.com

## Jugaad Bharat United Voters MAY2026

Simplifying Democracy - Strengthening Unity among voters

**₹ధనమూలమిదం జగత్ ₹**

ఇకపై మన ఓట్లను కొనుక్కుని మనపైనే అధికారం చలాయించే రాజకీయ పార్టీలకు స్వస్తి. ఓటు మనది. పార్టీ మనది. డబ్బు మనది. అధికారం మనది. పనిచేయని ప్రభుత్వాన్ని గద్దె దింపే అధికారం కూడా మనదే! జుగాడ్ 50:50 ద్విపక్ష-పార్టీ రాజనీతి (Model Political System) నమూనా మార్పు (paradigm shift). ఎన్నికల్లో గెలిస్తే మనం అధికారపక్షం! ఓడిపోతే బాధ్యతతో పనిచేసే ప్రతిపక్షపార్టీ! అందరూ మనవాళ్లే! అందుచేత, పార్టీ ఫిరాయింపు చట్టం రద్దు అయిపోతుంది.

ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల చట్టాలలో అధికశాతం, ప్రభుత్వ ఉద్యోగులకు అనుగుణంగా రచింపబడి, లాయర్లతోసహా ఎవరికీ అర్ధంకాక, న్యాయమేదో నిర్ధారించే బాధ్యతనంతా జడ్జీగారిమీదకి నెట్టేస్తున్నాయి. జిల్లా కోర్టులోవచ్చే తీర్పు హైకోర్టులోనూ, ఆతరువాత, సుప్రీంకోర్టు లోనూ సవాలు చేసే అవకాశం రాజ్యాంగమే కల్పించడంతో న్యాయానికి అర్ధమే మారిపోతోంది.అందుకు ముందుగా లాయర్ల ఫీజులను సరిదిద్ది న్యాయవ్యవస్థను సరళీకృతం చేద్దాం.

గ్రామస్థాయినుండీ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా పరిపాలన కావాలంటే - Jugaad ఓటర్లసాక్షిగా అధికార వికేంద్రీకరణ అమలుపరుస్తూ - మన MLA నియోజకవర్గ స్థాయిలో "లొసుగులులేని చట్టబద్ధ సుపరిపాలన" మనచే ఎన్నుకోబడ్డ MLA గారి ద్వారా సాధించుకోవచ్చు. మంచి చట్టాలను నిర్మించి మంచి పాలన అందించడమే MLAల యొక్క రాజ్యాంగబద్ధ ప్రాధమిక కర్తవ్యం. Jugaad పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తనకష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. లేదా, మెరుగైన సమాజం కోసం జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి, మీ వంతు బాధ్యత మీరు స్వీకరించండి.

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors): **Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH (12) D.V.S.Rao**

**జుగాడ్ ఓటర్లు :Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V.Ratnam 38) Smt Jayanti Vijaya 39) Vishnubhotla Venugopal**

advt

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th May 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001







*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**